## విలేకరులు కావలెను

గత 17 సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ప్రజాలక్ష్యం దిన పత్రికలో అనుభవం, ఆసక్తి కలిగినవారు ఈ క్రింది సెంటర్ల నుండి జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులుగా పనిచేయుటకు సంప్రదించండి

వరంగల్, హన్మకొండ, జనగామ మహబూబాబాద్, ములుగు, నల్గొండ, నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్ కర్నూల్, నారాయణ్‌పేట్ వికారాబాద్, ఖమ్మం, సూర్యపేట్, మెదక్

7330745381, 9394322782



Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి


## రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి14 : తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది.


సంపుటి: 16 | సంచిక: 269 | కరీంనగర్ | ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | పేజీలు: 12 | వెల: 2.00


### రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు

# కేబినేట్ ఆమోదం



- అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం
- ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే

11లో

### మున్సిపల్ ఫలితాల ప్రభావం

# అసెంబ్లీపై ఉండదు

- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 14 : తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే

11లో



### కరీంనగర్‌లో బిఆర్ఎస్

# కుమ్మక్కు రాజకీయం

- మేయర్ పదవి కోసం కాంగ్రెస్, ఎంఐఎంతో జట్టు
- తాజా పరిస్థితులపై ఆరా తీస్తున్న కేంద్రమంత్రి బండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఫిబ్రవరి 14 :కరీంనగర్‌లో మేయర్ పదవి కోసం ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'మేయర్' పదవి కోసం బీఆర్ఎస్ తన సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కైనట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ జనతా పార్టీని ఓడించేందుకు మూడు పార్టీలు ఒక్కటైనట్లు సమాచారం. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీజేపీని ఓడించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు

11లో

# మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు




- కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు
- మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిద్దిపేట, ఫిబ్రవరి 14 : మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్

11లో

# చక్రం తిప్పిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



▸▸ కామారెడ్డిలో హంగ్‌తో అస్పష్టత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్,ఫిబ్రవరి14 : టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సొంత మండలం భీంగల్‌లో చక్రం తిప్పారు. రెండు రోజుల ముందు వెళ్లి ప్రచారం


11లో













# ప్రజలు గొప్ప తీర్పునిచ్చారు

## - కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఓటు వేశారు
## - ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు
## - లక్ష్మి నగర్ తీర్పు అధికార పార్టీకి చెంపపెట్టు
## - రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటీ (గోదావరిఖని), ఫిబ్రవరి 14 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు గొప్ప తీర్పును ఇచ్చారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఓడిన కూడా తమ బిఆర్ఎస్ అభ్యర్థులు తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారని అన్నారు.కేవలం 50 నుండి 60 ఓట్ల స్వల్పతేడా తోనే నాలుగు స్థానాలను కోల్పోయామన్నారు.రామగుండం రాజకీయాల్లో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం, ప్రజలను ప్రచారానికి రాకుండాఅడ్డుకోవడం, అధికార దుర్వినియోగం వంటి చర్యలకు ఎమ్మెల్యేపాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు కల్పించినా ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గొప్ప తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఓటమి పాలైనప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థులు కష్టపడిన తీరు, అధికార పార్టీపై చేసిన పోరాటంఅభినందనీయమని ప్రశంసించారు. ఇది నైతికంగా బిఆర్ఎస్ పార్టీ విజయమన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజల విజయమని ఆయనవ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అరాచక పాలనకు తమ అభ్యర్థుల విజయం నిదర్శనమని అన్నారు. రానున్నఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బిఆర్ఎస్పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గెలిచిన కార్పొరేట్లను కూడా ప్రలోభాలకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రానున్న జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో బిఆర్ఎస్ జండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ ఎన్నికలలో సమన్వయ కమిటీని వేయడం జరిగిందని ఆ కమిటీ అభ్యర్థులకు టికెట్లను కేటాయించడం జరిగిందని,ఎన్నికలు పూర్తి అయ్యేవరకు ఆ కమిటీ సేవలు అందించిందని ఆయన గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి 13 మంది కార్పొరేటర్ అభ్యర్థులు గెలిచారని ఆయన పేర్కొన్నారు. లక్ష్మీ నగర్ ప్రాంతంలో బిఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, ఇది ఎమ్మెల్యే దుష్ట పాలనకు గుణపాఠం అని ఆయన హెచ్చరించారు. లక్ష్మీ నగర్ లో ప్రజలు ఇచ్చిన తీర్పు అధికార పార్టీకి చెంపపెట్టు లాంటిదని అన్నారు. అధికార పార్టీ ఎలాంటి వేధింపులకు గురిచేసిన పార్టీ నాయకత్వం అందరికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అధికార పార్టీని ఎదురొడ్డి పోరాడిన నాయకులకు కార్యకర్తలకు బి ఆర్ఎస్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు సహకరించిన కుల, మహిళ,కార్మిక,బస్తీవాడలో పెద్ద మనుషులకు, తెలంగాణ ఉద్యమకారు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులను సత్కరించారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, పి.టి. స్వామి, మురళీధర్ రావు, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, మేకల శారద,ఆవుల శ్యామమణి రమేష్, కర్క పద్మజ శ్రీనివాస్ రెడ్డి, తాళ్ళ చిన రాజయ్య,బాధవత్ నర్సమ్మ సారయ్య, నాయకులు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, అచ్చే వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజు, గుర్రం పద్మ, జక్కుల తిరుపతి ,పిల్లి రమేష్ చెలుకలపల్లి శ్రీనివాస్, కొలుగూరి సాయి, కిరణ్ జీ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ప్రజా జీవితములో నిలదొక్కుకుంటారు

## - ఓడిన అభ్యర్థులను ఓదార్చి ధైర్యం నింపిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఫిబ్రవరి, 14 : ప్రజాస్వామ్యంలో నాయకుల పాత్రకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్ఫూర్తినిచారు. శనివారం మున్సిపల్ ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులను ఇంటింటికి తిరిగి ఆప్యాయంగా పలకరించి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. నైరాశ్యం వద్దు నిత్యం ప్రజలలో ఉండండి. నాయకులను, కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం అని ఆయన అన్నారు. నాయకుల కష్టాలు పంటికింద బిగపట్టుకోవాలని పదిమందిలో ప్రదర్శించరాదని, మనోధైర్యంతో ముందుకు సాగాలని హితవు పలికారు. రాజకీయాలలో మహానుభావులు ఎందరో ఓడిపోయి నిరాశ చెందకుండా ఎంతో ఎత్తుకు ఎదిగారని అన్నారు. అధికారంలో ఉన్నపుడు అందరూ ఉంటారు ప్రతిపక్షములో నా వెంట ఉన్నవారిని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటా అని భరోసా కల్పించారు. పార్టీని,నాయకుణ్ణి నమ్ముకున్న వాళ్లకు భవిష్యత్తు ఉంటుందని రాబోయే ప్రభుత్వం కె.సి.ఆర్ ది అని అందరికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడి ఎన్నికలో హోరాహోరీగా పోరాడిన మీ పోరాట స్ఫూర్తి అభినందనీయం అని కొనియాడారు.నిరంజన్ రెడ్డి వెంట బోలెమోని లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్,పెండెం కురుమూర్తి యాదవ్,వేణు గోపాల్, గ్రంథం పరంజ్యోతి,వెంకటసాగర్,హా ఎర్ర శీను,నీల సామి,సురేందర్, గులాం ఖాదర్,ప్రభు,స్టార్ రహీం, సయ్యద్ జమీల్,డేగ మహేశ్వర్, హేమంత్ ముదిరాజ్,జోహేబ్ హుస్సేన్,గౌడ నాయక్,చిట్యాల రాము, ఉందే కోటి శివహా కురుమూర్తిలు ఉన్నారు.



# కౌన్సిలర్ల ఓటే కీలకం... చైర్మన్ ఎన్నికల రాజకీయ గణితం

## క్రాస్ ఓటింగ్ భయం... విప్ ఆదేశాల మధ్య ఎన్నికల ఉత్కంఠ

(రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)



మున్సిపల్ ఎన్నికలు స్థానిక స్వపరిపాలన వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య ప్రక్రియ. గ్రామీణ స్థాయిలో పంచాయతీలు ఎంత ప్రాధాన్యం కలిగి ఉంటాయో, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు అంతే ప్రాధాన్యం కలిగి ఉంటాయి. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా ఆరోగ్యం, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక వంటి అంశాలు మున్సిపల్ సంస్థల పనితీరుపైనే ఆధారపడి ఉంటాయి. అందువల్ల మున్సిపల్ ఎన్నికలు కేవలం రాజకీయ పోటీ మాత్రమే కాకుండా, పట్టణ పాలన దిశను నిర్ణయించే ప్రజా తీర్పుగా భావించాలి. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ సాధారణంగా వార్డు సభ్యుల ఎన్నికతో ప్రారంభమవుతుంది. పట్టణాన్ని పలు వార్డులుగా విభజించి, ప్రతి వార్డు నుంచి ఒక ప్రతినిధిని ప్రజలు ప్రత్యక్ష ఓటుతో ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల్లో స్థానిక సమస్యలు... రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, చెత్త నిర్వహణ... ప్రధాన ప్రచార అంశాలుగా మారుతాయి. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దించి, స్థానిక సామాజిక సమీకరణాలు, వర్గాల ప్రాధాన్యం, అభివృద్ధి వాగ్దానాలు వంటి అంశాల ఆధారంగా వ్యూహాలు రచిస్తాయి. వార్డు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అసలు రాజకీయ ఉత్కంఠ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల వద్ద కనిపిస్తుంది. చట్టపరంగా ఈ ఎన్నికలు ప్రత్యక్ష ప్రజా ఓటుతో కాకుండా, ఎన్నికైన వార్డు సభ్యుల ద్వారా జరుగుతాయి. ఈ దశలో సంఖ్యాబలం అత్యంత కీలకం అవుతుంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంటే ఎన్నిక సులభంగా పూర్తవుతుంది. కానీ త్రిశంకు పరిస్థితి ఏర్పడితే రాజకీయ చర్చలు, కూటములు, మద్దతుల కోసం పోటీ తీవ్రం అవుతుంది. చైర్మన్ ఎన్నిక పట్టణ పాలనకు నాయకత్వాన్ని నిర్ణయిస్తుంది. చైర్మన్ మున్సిపల్ మండలి సమావేశాలకు అధ్యక్షత వహిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తాడు. వైస్ చైర్మన్ సహాయక పాత్రలో ఉండి, అవసరమైనప్పుడు బాధ్యతలు స్వీకరిస్తాడు. ఈ పదవులు కేవలం గౌరవప్రదమైనవి మాత్రమే కాదు; స్థానిక రాజకీయాల్లో ప్రభావాన్ని, నిర్ణయాధికారాన్ని కలిగిస్తాయి. అందువల్ల ఈ ఎన్నికల సమయంలో రాజకీయ సమీకరణాలు అత్యంత సున్నితంగా మారుతాయి.

ఈ నేపథ్యంలో “క్యాంపు రాజకీయాలు” అనే పదం తరచుగా వినిపిస్తుంది. మెజారిటీ అనిశ్చితంగా ఉన్నప్పుడు పార్టీలు తమ వార్డు సభ్యులను ఒకేచోట ఉంచి, ప్రత్యర్థి పార్టీల ప్రభావానికి గురికాకుండా చూసుకోవడానికి క్యాంపులు నిర్వహిస్తాయి. రిసార్టులు, అతిథి గృహాలు లేదా పార్టీ కార్యాలయాలు ఇందుకు వేదికలవుతాయి. క్యాంపుల ఉద్దేశం సభ్యులను సమూహంగా ఉంచడం, వ్యూహాత్మక చర్చలు జరపడం, ఓటింగ్ రోజున ఐక్యతను నిర్ధారించడం. ఇది చట్ట విరుద్ధం కాకపోయినా, ప్రజాస్వామ్య నైతికతపై చర్చకు దారితీస్తుంది. చైర్మన్ ఎన్నికల సమయంలో తరచుగా వినిపించే మరో అంశం “క్రాస్ ఓటింగ్”. ఒక పార్టీకి చెందిన సభ్యుడు ప్రత్యర్థి అభ్యర్థికి ఓటు వేయడం క్రాస్ ఓటింగ్‌గా పరిగణించ బడుతుంది. ఇది సాధారణంగా అంతర్గత అసంతృప్తి, వ్యక్తిగత సంబంధాలు లేదా రాజకీయ లావాదేవీల ఫలితంగా జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. క్రాస్ ఓటింగ్ వల్ల అంచనాలు తారుమారవుతూ, ఫలితాల్లో అనూహ్య మలుపులు కనిపిస్తాయి. క్రాస్ ఓటింగ్‌ను నియంత్రించేందుకు పార్టీలు విప్ జారీ చేస్తాయి. విప్ అనేది పార్టీ ఆదేశం; సభ్యుడు పార్టీ నిర్ణయానికి అనుగుణంగా ఓటు వేయాలని ఇది స్పష్టం చేస్తుంది. విప్‌ను ఉల్లంఘిస్తే సభ్యునిపై అనర్హత చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. స్థానిక సంస్థల చట్టాల ప్రకారం, పార్టీ మార్పిడి నిరోధక నిబంధనలు అమల్లో ఉండటంతో విప్‌కు చట్టపరమైన బలం లభిస్తుంది. అయినప్పటికీ, రహస్య ఓటింగ్ ఉన్న సందర్భాల్లో విప్ అమలు సవాళ్లను ఎదుర్కొంటుంది.పట్టణీకరణ వేగవంతమవుతున్న నేపథ్యంలో మున్సిపల్ పాలనపై ప్రజల అంచనాలు కూడా పెరిగాయి. అభివృద్ధి పనుల అమలు, పన్నుల వసూళ్లు, సంక్షేమ పథకాల పంపిణ... ఇవన్నీ ఎన్నికైన మండలి సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల చైర్మన్ ఎన్నిక కేవలం అంతర్గత రాజకీయ ప్రక్రియ కాదు; పట్టణ అభివృద్ధి దిశను నిర్ణయించే కీలక ఘట్టం. మున్సిపల్ రాజకీయాల్లో వ్యక్తిగత ప్రతిష్ఠ, స్థానిక వర్గాల ప్రభావం, పార్టీ విధానాలు... ఈ మూడు పరస్పరం మిళితమై ఉంటాయి. ఎన్నికల తర్వాత సభ్యుల ఐక్యత నిలకడగా ఉంటే పాలన సాఫీగా సాగుతుంది. విభేదాలు పెరిగితే అభివృద్ధి కార్యక్రమాలు నిలిచి పోవచ్చు. అందుకే ప్రజాస్వామ్య విలువలు, పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం అత్యంత అవసరం. క్యాంపు రాజకీయాలు, విప్ జారీ, క్రాస్ ఓటింగ్ వంటి అంశాలు మున్సిపల్ ఎన్నికలను ఉత్కంఠభరితంగా మారుస్తాయి. అయితే చివరికి ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు పట్టణ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ఎన్నికల పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా, పాలనలో సహకారం అవసరం. స్థానిక స్వపరిపాలన బలపడితేనే పట్టణ జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. మొత్తం మీద మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది స్థాయిలో బలాన్ని ఇస్తాయి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల రాజకీయ నాటకీయత వెనుక ప్రజల అభివృద్ధి ఆశలు దాగి ఉంటాయి. క్యాంపులు, విప్‌లు, వ్యూహాలు అన్నీ రాజకీయ ప్రక్రియలో భాగమే అయినప్పటికీ, తుది లక్ష్యం ప్రజా సేవ కావాలి. పట్టణ పాలనలో స్థిరత్వం, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడు మాత్రమే మున్సిపల్ వ్యవస్థ తన అసలు ఉద్దేశాన్ని నెరవేర్చగలదు.

# స్వతంత్రులను ఆదరించారు

## - రెండు మున్సిపాలిటీల్లో 8 మంది స్వతంత్రులు గెలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనీ ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి జరిగిన మొదటిసారి ఎన్నికల్లో విజయం వరించిన అభ్యర్థులు ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతారు. మున్సిపాలిటీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైన క్షణం నుండి రిజర్వేషన్లకు అనుకూలంగా బరిలోకి దిగిన అభ్యర్థులందరూ పోటాపోటీగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో పోటీకి సై అంటే సై అన్నట్లుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో సుమారు19 వేలకు పైగా ఓటర్లు ఉండగా 20 వార్డులు ఉన్నాయి. ప్రధాన పార్టీలు అన్ని రిజర్వేషన్లకు అనుకూలంగా ఒకటికి రెండుసార్లు ఆలోచించి ఏ అభ్యర్థి అయితే అక్కడ గెలుస్తారో అలాంటి వ్యక్తులని బరిలోకి దించగా అనూహ్యంగా కొన్ని వార్డు స్థానాల్లో ఇతర పార్టీ అభ్యర్థులు, మరికొన్ని వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం వరించారు. ఎవరు ఊహించని విధంగా ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 4 గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా ,కాగజ్నగర్ మున్సిపాలిటీలో సైతం 4 గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. ప్రతిసారి ఎన్నికల్లో పలుకుబడి కలిగిన పార్టీల తరఫున బరిలోకి దిగేందుకు ఉత్సాహం చూపిస్తారు. బి ఫామ్ లు వచ్చిన తర్వాతనే ప్రచారాన్ని మొదలు పెడతారు. రాజకీయ పార్టీల తరపున ఆయా గుర్తుల పైన గెలవడం, ఆ పార్టీల గుర్తులు అందరికీ గుర్తు ఉండడం సాధారణం. కానీ స్వతంత్ర అభ్యర్థులకు బ్యాట్, ఉంగరం, చపాతీ రోలర్ లాంటి గుర్తులు వస్తాయి. ఆయావార్డుల్లో వారి పేర్లతో సహా గుర్తులను సైతం గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బారాస ఎమ్మెల్యే కోవాలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 7, భారాసాకు 9, స్వతంత్రులు 4 గురు గెలుపొందడంతో ఇక్కడ హంగ్ ఏర్పడింది. ఇది ఇలా ఉండగా మునుపెన్నడూ లేని విధంగా ఇక్కడ ఏకంగా నాలుగు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందడంతో రాజకీయ విశ్లేషకులు వివిధ రకాలుగా విశ్లేషిస్తున్నారు. వివిధ పార్టీలు ప్రజలకు మెరుగైన పాలనను అందించకపోతే మార్పు మొదలవుతుందనే సంకేతాలను ఇచ్చినట్లు ఉంది అని పలువురు చర్చించుకుంటున్నారు. భవిష్యత్తులో మరే ఎన్నికలు ఉన్న ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు స్వతంత్రుల సంఖ్య పెరిగే అవకాశాలు సైతం ఉంటాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఓడిన తల్లి బిడ్డలు

ఇటీవల విడుదలైన మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నుండి 13వ వార్డులో తల్లి చర్ల విజయ, 14వ వార్డులో కూతురు చర్ల సారిక ఓడిపోయారు. రెండు చోట్ల కౌన్సిలర్ అభ్యర్థులుగా బరిలోకి దిగిన తల్లి బిడ్డలు ఇద్దరు ఓడిపోవడంతో నిరాశకు గురయ్యారు. అదేవిధంగా బారాస పార్టీ తరపున రెండు చోట్ల బరిలోకి దిగిన భార్యాభర్తల్లో ఒకచోట విజయం భార్యను వరించగా మరోచోటభర్త ఓడిపోయారు.




# అక్రమ లింకు కెనాల్ - గార్ల మండలానికి మరణ శాసనం

## తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గార్ల (ఖమ్మం), ఫిబ్రవరి 14 : మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ఏజెన్సీ గిరిజన ప్రాంతమైన గార్ల మండలానికి మరణ శాసనమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మున్నేరు తీరమైన మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల చౌరస్తాలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కమిటీ ఆద్వర్యంలో ప్రచురించిన మున్నేరు పోరు... 100 నినాదాల జన హోరు కరపత్రాన్ని విశ్వ జంపాల ఆవిష్కరించారు. అనంతరం విశ్వ మాట్లాడుతూ దశాబ్దాలుగా మన సాగునీటి కలలను సాకారం చేయాల్సిన పాలకులు, నేడు మన నోటికాడి కూడును లాగేస్తూ, ‘మున్నేరు - పాలేరు లింక్ కెనాల్’ (జీవో నంబర్ 98 తేది.17.05.2026) పేరుతో మున్నేరు నీళ్ళను పాలేరుకు తరలించడానికి ప్రయత్నిస్తూ మున్నేరు జల దోపిడీకి తెర లేపారనీ ఆయన అన్నారు. మన భూములను నాశనం చేస్తూ, మన నీటిని తరలిస్తూ, రాజ్యాంగం కల్పించిన పెసా (గ్రాజుూా) చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. లింక్ కెనాల్ రద్దు చేయాలి - మున్నేరు రిజర్వాయర్ నిర్మించి మున్నేరు పరీవాహక ప్రాంతంలోని 60 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలనీ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయం లేని లింకు కెనాల్ - పాలకుల స్వార్థానికి సాక్ష్యం! ఈ అన్యాయాన్ని ఎదిరిద్దాం.. మన హక్కులను కాపాడుకుందామని విశ్వ మున్నేరు ప్రాంత ప్రజలకు పిలుపునిచ్చారు. మున్నేరు తీరాన జన హోరు జాతరై - మున్నేరు పోరు కేరటమై గర్జించండీ - నయవంచక పాలకులను ఎదిరించి మున్నేరును కాపాడుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావతి లక్ష్మణ్ నాయక్ కోక్ కన్వీనర్స్ కట్టబోయిన శ్రీనివాస్ జడ సత్యనారాయణ కత్తి సత్యం మాట్లాడుతూ జలదోపిడి చేసే పాలకులు ప్రజా ద్రోహులని, మా జీవనాధారాన్ని వేరే చోటికి మళ్ళిస్తే ఊరుకోమని, మున్నేరు జల వనరులపై హక్కు మాది తరలించే అధికారం మీకు ఎక్కడిదని పాలకులను ప్రశ్నించారు. లింకు కెనాల్ వద్దు మున్నేరు ప్రాజెక్టు ముద్దు అని, పాలకుల రాజకీయ స్వార్థం కోసం మున్నేరు పరివాహక ప్రాంతాన్ని ఎడారి చేయాలని చూస్తే ఊరుకోమని వారు హెచ్చరించారు. భావితరాల కోసం మున్నేరు ప్రాంత ప్రజలంతా ఐక్యమై మున్నేరును రక్షించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, కో కన్వీనర్స్ కట్టేబోయిన శ్రీనివాస్, జడ సత్యనారాయణ, జంపాల వెంకన్న, పానుగంటి రాధాకృష్ణ, కత్తి సత్యం, గుగులోత్ సక్రు, వంగూరు పెద్ద వెంకటేశ్వర్లు, పోతుల నరసింహారావు, శీలంశెట్టి రమేష్, సూత్రపు రాజు యాదవ్, షేక్ జానీ, మలోత్ మాన్య నాయక్, దూడపంగు శ్రీనివాస్, కొండలరావు, బండారి వెంకట్, చంద్రశేఖర్, బాదావత్ రమేష్, ఉపేందర్, వినయ్, చంటి చంటి నాయక్, హరి నాయక్, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా మహారాష్ట్రలోని విసాపూర్‌లో గల బొటానికల్ గార్డెన్ సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. కళాశాల వృక్ష మరియు జంతు శాస్త్ర విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొని పలు విషయాలు తెలుసు కున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి క్షేత్ర పర్యటనల వల్ల విద్యార్థులకు ఆయా అంశాలపై ప్రత్యక్ష అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు.బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ పరికరాలపై ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి.దేవేందర్ రెడ్డి విద్యార్థులకు వివిధ ఔషధ,ఆర్థిక ప్రాముఖ్యత గల మొక్కల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.బొటానికల్ గార్డెన్‌లోని జీవ వైవిధ్యం గురించి జంతుశాస్త్ర అధ్యాప కులు బి.వెంకటేశం వివరించగా, మహారాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక నిర్మాణాలు, వారసత్వ సంపద గురించి తెలుగు, హిందీ విభాగాధిపతులు డా.డి.లక్ష్మినరసింహం, డి.జనార్ధన్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ క్షేత్ర పర్యటనలో అధ్యాపకులు డా.ఇ. శారద, బి.వెంకటేశం, మల్లిఖార్జున్, నర్సింగరావు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# తొలిదశ పార్లమెంట్ సమావేశాలు ముగింపు


పార్లమెంట్ బడ్జెట్ తొలిదశ సమావేశాలు ముగిసాయి. యధావిధిగా రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ ప్రసంగం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటివన్నీ యథాలాపంగా ముగించేశారు. నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్నట్లుగా..ఈ సమావేశాలను కూడా మొక్కుబడిగానే ముగించేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పెద్దగా మెరుపేలమీ లేవు. ప్రభుత్వం చెబుతన్నదే చర్వితచరణంగా చెబుతున్నారు. ఇకపోతే స్పీకర్ ఓంబి ర్లాపై అవిశ్వాస తీర్మానం ఒకటి ఈ సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన ప్రతిపక్షం ఆరోపణగా ఉంది. స్పీకర్, ప్రబుత్వానికి సంబంధించినంత వరకు ఇదో మరక లాంటిదే. చరిత్రలో ఫలానా స్పీకర్ తీరుపై అవిశ్వాసం పెట్టారని గుర్తుండిపోతుంది. నిజానికి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలోనే అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. పాలకపక్షాన్ని విపక్షాలు నిలదీస్తాయి. విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. అలాగే అవకాశం వచ్చేలా విపక్షం కూడా వ్యవహరించడం లేదు. చర్చ జరిగితే ప్రజల సమస్యలు దేశానికి తెలిసేవి. కానీ మొక్కుబడి సమావేశాలు సాగుతున్న తీరు దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలోనే ప్రధాని సమాదానం చెప్పి సరిపుచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చాక విపక్షాల సమస్యలను ఆకళింపు చేసుకోవడమో లేదా, వారినుంచి చర్చను ఆహ్వానించడమో జరగడం లేదు. అర్ధవంతమైన చర్చలను చూసి పార్లమెంట్ ఎన్నో ఏళ్లు గడిచి పోతున్నాయి. పార్లమెంటుకు ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం చాలా బాధాకరం. ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే విపక్షనేతను పార్లమెంట్‌కు అనర్హుడిని చేయాలని బిజెపి సభ్యుడు కూడా ప్రతిపాదించడం కేవలం కక్షసాధింపు చర్యగానే చూడాలి. తమ తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలకపక్షం చేస్తున్న ప్రయత్నాలు ఎంతోకాలం సాగవని గుర్తించాలి. అమెరి కాతో ఒప్పందం కావచ్చు, యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం కావచ్చు..పార్లమెంటు చర్చించాల్సి ఉంది. ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చ సాగాలి. కానీ అలా సాగడం లేదు. అధికార పార్టీ నేతలు అడుగడు గునా రాహుల్ గాంధీ నిలదీసి ప్రశ్నిస్తున్నారు. దానిబదులు అతను ఏం చెబుతాడో తెలుసుకుంటే బాగుం డేది. రాహుల్ గాంధీ ఇస్తున్న వాయిదా తీర్మానాలు ఎలాగూ చర్చకు రావడం లేదు. కనీసం మరో విధంగా చర్చకు తీసుకునే అవకాశం గురించి రాహుల్ ఆలోచిం చడం లేదు. ఒకవేళ సమస్యలపై సిరయస్‌గానే చర్చ జరగాల్సి ఉంటే అందుకు అనేక రకాల మార్గాలు ఉన్నాయి. రూల్స్ పొజిషన్ ఉంది. అలా చర్చను కోరే అవకాశం సులువు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేర నడుస్తున్న ప్రహసనంలో ఏం జరిగిందో దేశ ప్రజలకు తెలియాలి. అమెరికా మధ్యంతర ఒప్పందం కారణంగా దాని ప్రభావం మనదేశ రైతాంగంపై పడుతుందన్న భావన ఉంది. అలాంటిదేమీ లేదని పాలకవర్గం చెబుతోంది. అవే విషయం పార్లమెంట్ వేదికగా చెప్పివుంటే బాగుండేది. దేశ ఉత్పత్తులపై సుంకాన్ని జీరో శాతానికి తేవడం అంటే.. ఇక్కడి చిన్న, సన్నకారు వ్యవసాయదారుల్ని, వ్యాపారుల్ని రోడ్డున పడేయడమేనని అంటున్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు పార్లమెంట్ చర్చల ద్వారా పరిష్కారం చూపాల్సి ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పంద నిర్ణయం చిన్నవిషయం కాదు. ఇది కేవలం మోడీకి సంబంధించి నది అస్సలే కాదు. పార్లమెంటును విశ్వాసం తీసుకోవా ల్సింది. కీలకమైన విషయాల్లో ఈ దేశ పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవడం అవసరం. కానీ అలా జరగడంలేదు. వాణిజ్య ఒప్పందం కోసం రష్యాతో చము రు కొనుగోళు తగ్గించినా అమెరికా మనల్ని పాకిస్తాన్‌తో సమానంగా చూడడం దురదృష్టకరం. ఇప్పుడు ప్రధానిగా ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మోడీపై ఉంది. అనేక సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌కు అవకాశం కల్పించాలి. ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలి. దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు సవివరమైన సమాధానం రావాల్సి ఉంది. అప్పుడే పార్లమెంట్‌కు విలువ ఉంటుంది. ఇందుకు తాము అనుగుణంగా ఉన్నామా లేమా అన్నది ఇరుపక్షాలు బేరీజు వేసుకోవాల్సి సమయం కూడా.

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపం ధర్మపురి శివాలయం...


## శివరాత్రికి ముస్తాబైన రామలింగేశ్వరాలయం...



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494







భారత దేశ ప్రాచీన సంస్కృతీ సభ్యతలకు నిలయంగా సనాతన సాంప్రదాయా లకు పుట్టినిల్లుగా, వేదవేదాంగ శాస్త్రాగమ, నృత్య గీత నాట్యాది సకల కళలయందు నిష్ణాతులైన ధార్మిక కార్యాదరణాసక్తులైన ప్రజానీకంతో, మరెచ్చటా కానరానన్ని ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న పలు దేవాలయాల సముదాయం కలిగి, రాష్ట్రం లో సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరి తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది నాటి అవిభక్త కరీంనగర్, నేటి నూతన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీ నరసింహ, శ్రీరామ లింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీ భూతంగా నిలిచియుంచీ క్షేత్రరాజం. గంభీర గౌతమీనది తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై పౌరాణిక ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈ క్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామలింగేశ్వరాలయం. భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షిం చిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో, నిత్యానందంలో మునిగి తేలుతూ, ఆ మహర్షి

రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగరూపులో ఉంటూ, ఎవరిచేత పూజింపబ డకుండు నట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తి పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్టించి, పూజించి శాప నిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈశాన్యాన, సైకత (జసుల) లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాండితుడై నట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. ఆరవ శతాబ్దంలో స్థాపించబడి, ఎనిమిదవ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాకుక్య రాజుల ప్రాభవంలో పునర్మించ బడిన రామేశ్వరాలయంలోని గణేశ విగ్రహములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.973 నుండి 1140 వరకు పాలించిన కల్యాం చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకితుడుగు ఆరవ విక్రముని (1076-1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్యరాజు పరమేశ్వర, రణ రంగభైరవ, మార్వల భైరవ, ఆయత గంధ వారణ, విక్రమాదిత్య బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతి గణపతి దేవుని శిలాశాసనం రామేశ్వరాలయంలో పూర్వపు చాళుక్య స్థంభం పైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగరంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొనబడినవి. చాళుక్య శైలిలో బొజ్జ ఎత్తుగా నుండి, సహజమైన ఏనుగు తలను కలిగి, మానవ రూపంలేని గణపతి విగ్రహం ఆలయ సముదాయంలో నుంది. శివాలయ శిఖర నిర్మాణంలో చాళుక్య శైలి ఉంది. శిఖరం చాపాకృతిని పోలి. కిందనుండి పైకి ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. శిఖర సౌందర్యానికి పైన ఆమలకములు వృత్తకారంలో చుట్టూరా కలిగి, ఆంతకుపైన కలశం, తూర్పున శుక నాసం ఉన్నాయి. శుక నాసం చిలుక ముక్కు లాగ ముందుకు పొడుచుకు వచ్చిన గూడు, శిఖర నిర్మాణం ఉత్కళ శైలిలో, లింగరాజ స్వామి ఆలయం (భువనేశ్వర్) దేవాలయ శఖరాకృతిని పోలి ఉంది. ప్రవేశ మంటపం తర్వాత దూరంగా గర్భాలయంలో మొదట ముఖ మంటపం ఉంది. మధ్యన గల రంగ శిల ప్రాచీనంగా నర్తకీమణుల వేదిక, నేడు అది వల్ల బండ.తర్వాత చీకటిగా.నుండే అంత రాళం, అపైన గర్భ గృహం. అందు శ్రీరామచంద్ర స్థాపిత సైకత (జముక) లింగం, ముఖ మంటపము, ప్రవేశ మంటపము, గర్భ గృహములు, ఆలయ ప్రాంగణంలో దాటితే శివుని దర్శనం. అలయ ప్రాంగణం లో మూడు ద్వారాలకు అభిముఖంగా నల్లరాతితో నిర్మించిన ఆభరణాలు అధికంగా గల, పీఠంపై ఉబ్బెత్తు హారాలు గలిగి, కాకతీయ ఆల యాలలోవలె శిలాకృతులు, జిలుగు నగిశీలు, మెడలో గంటలు, మువ్వల పట్టి, మెడ పట్టెడలు, గంగడోలు, వంపు తిరిగిన మెడ, వృహణాలతో నందులు ఉన్నాయి. పైకప్పుపై అపురూపాలైన ఏక ముఖ ద్వి దేహ నందులు నాలుగు మూలల ఉండేవి. సాలహార పునర్నిర్మాణ సమయంలో కూల్చి వేయడం జరిగింది. దేవాలయం కప్పుకన్నా ఎ త్తుగా, నిటారుగా 15అడుగుల ఎత్తు ఉన్న ధ్వజ స్థంభం (విజయ స్థంభం) ఉంది. శివాలయ ఈశాన్య భాగాన గణపతికి ప్రత్యేక గుడి ఉంది. ఇది కూర్చోని ఉన్న భారీ విగ్రహం. చాళుక్యుల కాలం నాటి విగ్రహానికి కుడి చేతులో గద ఉంది, నాగభంధం కలదు .ఎడమ చేతిలో గండ్రగొడ్డలి వంటి ఆయుధం, ఎడమ కింది చేతిలో మోదకాలు (ఉండ్రాళ్ళు) ఉన్నాయి. చెవులు చేటంత విశాలంగా ఉన్నాయి. రెండు వీర గల్లుల

శిల్పాలున్నాయి. పదాతిదళపు వీరుడు శత్రువులను చీల్చి చెండాడు తున్న దృశ్యం, ప్రాంగణం బయట నాగిని విగ్రహముంది. పైన నాగుల ఐదు పడగలతో కింద స్త్రీమూర్తి, చివర తోక, లేకుండా ఉంది. ఎనిమిది చేతుల మహిషాసుర మర్ధిని విగ్రహం ఉంది. అలాగే అపురూపాలైన బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ లేదా వరాహ పురాణంలో చెప్పబడిన యోగీశ్వరి ఆదిగా సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఒకే పీఠంపై చతురస్రాకార శిల్పమిది. ఇరు పార్శ్వాలలో గణపతి వీర భద్రుని విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన దైవత లింగం కాక, ముఖ మంటపంలో వాయవ్యాన కాశీ విశ్వనాథుడు


పేరుతో పూజలందుకునే 4 అడుగుల ఎత్తుగల లింగం ఉంది. దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి, శివ పూజ చేసేందుకు, హనుమంతుని లింగం తెమ్మని కాశీకి పంపగా, ప్రతి ప్రతిష్టించే సమయానికి ఆంజనేయుడు రాని స్థితిలో, సైకత లింగ ప్రతిష్ట గావించారని, ఆలస్యంగా ఏతెంచిన హనుమ సేవలు వ్యర్థం కాకుండా, హనుమల్లింగాన్ని ప్రతిష్ఠచేసి, ఆ లింగాన్ని పూజించాకే, గర్భాలయంలోకి వెళ్ళేలా నియమం శ్రీరాముడు ఏర్పరచారని స్థల పురాణం స్పష్ట పరుస్తున్నది. ఆలయంలో 13వ శతాబ్ధం కాలంనాటి చండిక విగ్రహం కలదు. ఈ విగ్రహంలో అమ్మవారు చక్రస్తని, త్రిశూల, ఖడ్గహస్త, మకుట ధారిణి, చతుర్భుజ, శూల ధారిణిగా ఉంది. కాశీ విశ్వనాథుని పక్కన ప్రాచీన పార్వతీదేవి శిల్పం, మహిషాసుర మర్ధిని, షణ్ముఖుడు (కుమార స్వామి), ఉమా మహేశ్వరులు విడివిడిగా నల్ల శిలపై మలచబడి ఉన్నాయి. ఆలయంలో విక్రమాదిత్యుని, గణపతి దేవుని, ప్రధాన ద్వార కడప ముందర, బంకుళ్ళలో, దక్షిణ ప్రవేశ ద్వార స్థంభం, నైరుతి దిశలో ప్రహరీగోడ బాహ్యాది ఆరు శాస నాలున్నాయి. చుట్టూ రథం తిరిగేంత ప్రాంగణం, 10 అడుగుల ప్రహరీ కలిగి ఉన్నదీ ఆలయం. చారిత్రిక నేపథ్యం ప్రకారం, క్రీ.శ.1309లో ఢిల్లీనేలిన అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాఫూర్, ఇందూరు (నిజామాబాద్ ) మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, నృసింహాలయాలు ధ్వంసం చేయబడినవి. క్రీ.శ.1332-1367 మధ్యకాలంలో తెలంగాణా లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి


దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయా మాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరి వ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదు లకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా(1674-1687) మంత్రియగు మాదోభా నూజీ సూర్యప్రకాశ రావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చనకు సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల, ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజా నైవేద్యాది విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకో బడింది. ఫలితంగా లక్ష్మీనరసింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. వివిధ ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూ తతో నిధులను ప్రోగుచేసుకుని ముఖ్యమంత్రి సర్వశ్రేయో నిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలష, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని , శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర, శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్టిం చడం జరిగింది. శివరాత్రి, శివ కళ్యాణం, రథోత్సవం, గణపతి నవగ్రహ పూజలు, శంకర జయంతి, శరన్నవరాత్రుల ఉత్సవాలను, నరసింహ స్వామివారల బ్రహ్మోత్సవ వేడుకలలో అంత ర్భాగంగా ఉత్సవాలను ఈ ఆలయంలో ఏడా సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మకర్తల మార్గదర్శకత్వంలో సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు విశ్వనాథం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఏర్పాట్లు చేశారు.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# ప్రాచీన చరిత్రకు సాక్ష్యం దుబ్బ రాజేశ్వరాలయం

## మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి





భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా స్వయంభూ దైవమైన శ్రీరాజ రాజేశ్వర స్వామికి పేరుంది. జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతమైన పెండెట్ల గ్రామం వద్ద గుట్టపైన శ్రీరాజరాజేశ్వరుడు వెలసియున్నాడు. తెలియక చేసిన పాపాలు స్వామిని స్మరించిన మాత్రానే పటాపంచల వుతాయని సంసార ఇబ్బం దులు, సకల సంకటాలు మృత్యు భయాలన్నీ రాజేశ్వర దర్శన మాత్రం చేత తొలగి పోగలవని నమ్మిన తమతో ఏర్పరచుకుని అష్టైశ్వర్యాలు సమకూరుస్తూ, ఎల్ల వేళలా వెన్నంటి కాపాడే కారుణ్యమూర్తి రాజేశ్వరుడని భక్తుల విశ్వాసం.

పెంబెట్ల రాజేశ్వరాలయానికి ఘన చరిత్ర ఉంది. ప్రస్తుతం ఉన్న దేవాలయం నూతన కట్టడం కాగా, దీని స్థానంలో ప్రాచీన సనాతన కట్టడం ఉండేదని లభ్యమైన శిలాశాసనాల ద్వారాతె లుస్తున్నది. జగిత్యాల వాస్తవ్యులు, ప్రముఖ చారిత్రక పరిశోధకులు విశ్రాంత ప్రొఫెసర్ జైసెట్టి రమణయ్య పరిశోధన ఫలితంగా ఈ దేవాలయం వెలుగు చూసింది. తెలుగులో చెక్కబడిన పురావస్తు శాఖచే 1974లో ముద్రితమైన శాసనాన్ని బట్టి అంతకు ముందే ఇక్కడి ఆలయం ప్రాచుర్యం పొందినట్లు భావించ బడుతున్నది. అటవీ క్షేత్రంలో అలనాడు దుబ్బపై నిర్మితమైన రాజేశ్వరాలయం. 18వ శతాబ్దం నుండే అత్యంత వైభవోపేతంగా విరాజిల్లిన కాకతీయుల కాలపు పుణ్యక్షేత్రంగా గుర్తింపు నొందినది. ఆలయ ప్రాంగణంలోనే కాకతీయ ప్రభువుల కళాభిజ్ఞతకు ప్రబల నిదర్శనాలుగా చెక్కబడిన, రెండు సుందరమైన ద్వార పాలకుల విగ్రహాలు, మిగుల మనోజ్ఞలుగా నిలిచి యున్నాయి. రెండు మూర్తు లు కూడా నాలుగేసి చేతులు కలిగియుండి, ఉపరి హస్తంలో కుడివైపు చక్రం, ఎడమవైపు శంఖం మకుటాలు, కుండలాలు, గ్రేయకాలు, హారాలు, కేయూరాలు, మోచేతి, ముంజేతి కడియాలు కటిబంధం వనమాల, కాలి కడియాలు, సూపురాలు మొదలైన ఆభరణాలతో ఈ అపురూప శిల్ప కళాకృతులు చెక్క బడ్డాయి. విగ్రహాల అడుగు భాగాన వింజా మరలు వీచే అందమైన సుందరాంగుల ప్రతిమలున్నాయి. ద్వార పాలకుల విగ్రహాల పక్కనే శిథిలమైన ఆనాటి ఆలయ ద్వారకల్పం, గజ, సింహ ప్రతిమలతో ఆలరారు తున్నది. లభ్యమైన విగ్రహాలను బట్టి ఇక్కడ ఒక వైష్ణవాలయం ఉండేదని తెలు స్తున్నది. రాజేశ్వర దేవస్థానంలో రామాలయం, అంజనేయస్వామి, నవగ్రహ మండపం, వల్లు బండ కలిగి, సర్వ శ్రేయో నిధి నిధులతో గండాదీప, రామాలయ గోపుర నిర్మాణాలు పూర్తి చేశారు. వివిధ ధర్మకర్తల మదలుల ద్వారా విశేష అభివృద్ధి పథంలో పయనిస్తూ, భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లు తున్నది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆలయంలో శివరాత్రి ఉత్సవ వేడుకలు సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు వైభవంగా జగ నున్నాయి. 15న ఆది వారం మహాశివరాత్రి జాగరణ, అర్ధరాత్రి 12-00 గంటలకు లింగోద్భవ కాలమున రుద్రాభిషేక నిషే పూజ, 16న సోమ వారం పారణ పగలు 2-30 గంట లకు స్వామి వారికి అన్నపూజ, 17న మంగళ వారం ఉదయం 9.30 గంటలకు శ్రీ స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఈఓ వడ్లూరి అనూష, అర్చకులు, సిబ్బంది వలసిన ఏర్పాట్లు చేశారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

**- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం**

**- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి**

రంగారెడ్డి, ఫిబ్రవరి14 : మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారిం చారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహ చరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

# సింగరేణి కొత్త సిఎండిని కలిసిన ఏఐటీయూసీ నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, ఫిబ్రవరి 14 : హైదరాబాదులోని సింగరేణి భవన్ లో శనివారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కందికట్ల వీరభద్రయ్య, వైవి రావు, ముస్కే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, షేక్ బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల వైద్య సౌకర్యాలకై వినతి

## సింగరేణి సిఎండికి లేఖ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి : సింగరేణి నూతన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జ్యోతి బుద్ధ ప్రకాష్‌కు 'సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్' హృదయపూర్వక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొం టున్న సుదీర్ఘ కాలపు వైద్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు డి.రామచందర్ రావు శనివారం ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ క్రింది సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల కోసం అవుట్ పేషెంట్ చికిత్సా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, సింగరేణి ఆసుపత్రులలో ఉచిత ఇన్‌పేషెంట్ చికిత్సను అందించాలని, అందుకోసం కోల్ ఇండియా ఒప్పందంతో సంబంధం లేకుండా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి డాక్టర్ వి.వెంకటస్వామి గతంలో ప్రకటించిన విధంగా, సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ పథకం కింద అదనంగా రూ.2 లక్షల బీమా కవరేజీని తక్షణమే అమలు చేయాలని, హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఉచిత వైద్యం అందేలా నిబంధనలు సడలించి పూర్తి యాక్సెస్ కల్పించాలని ఆ వినతి పత్రంలో ఆయన కోరారు. హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడటం పట్ల అసోసియేషన్ సంతోషం వ్యక్తం చేసింది. ఇది రిటైర్డ్ ఉద్యోగులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డి.రామచందర్ రావుతో పాటు ప్రధాన కార్యదర్శి ఎ.వేణు మాధవ్, కోశాధికారి ఎం.విజయ బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


# సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల వైద్య సౌకర్యాలకై వినతి

## సింగరేణి సిఎండికి లేఖ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి : సింగరేణి నూతన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జ్యోతి బుద్ధ ప్రకాష్‌కు 'సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్' హృదయపూర్వక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొం టున్న సుదీర్ఘ కాలపు వైద్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు డి.రామచందర్ రావు శనివారం ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ క్రింది సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల కోసం అవుట్ పేషెంట్ చికిత్సా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, సింగరేణి ఆసుపత్రులలో ఉచిత ఇన్‌పేషెంట్ చికిత్సను అందించాలని, అందుకోసం కోల్ ఇండియా ఒప్పందంతో సంబంధం లేకుండా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి డాక్టర్ వి.వెంకటస్వామి గతంలో ప్రకటించిన విధంగా, సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ పథకం కింద అదనంగా రూ.2 లక్షల బీమా కవరేజీని తక్షణమే అమలు చేయాలని, హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఉచిత వైద్యం అందేలా నిబంధనలు సడలించి పూర్తి యాక్సెస్ కల్పించాలని ఆ వినతి పత్రంలో ఆయన కోరారు. హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడటం పట్ల అసోసియేషన్ సంతోషం వ్యక్తం చేసింది. ఇది రిటైర్డ్ ఉద్యోగులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డి.రామచందర్ రావుతో పాటు ప్రధాన కార్యదర్శి ఎ.వేణు మాధవ్, కోశాధికారి ఎం.విజయ బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




# సమర్థునికి ఇల్లందు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలి

## - బిజెపి జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఇల్లెందు, ఫిబ్రవరి 14 : భద్రాద్రి జిల్లా ఇల్లందు మున్సిపల్ ఎన్నికలు ముగిశాయని, ఇక రాజకీయాలు పక్కన పెట్టి ఇల్లందు పట్టణ అభివృద్ధి కోసం ఎన్నికైన కాంగ్రెస్ కౌన్సిలర్ లతో ఏర్పడబోయే పాలక మండలి చైర్మన్ పదవిని పార్టీలో సీనియర్ కు, సమర్థమైన వ్యక్తికి ఇవ్వాలని కోరుతున్నామని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు చేరిన లిక్కర్ సిండికేట్ ముఠాకు చైర్మన్ పదవి ఇచ్చినట్లయితే, ఇల్లందు పట్టణం లిక్కర్ పట్టణంగా మారి వార్డుకు వంద బెల్టు షాపులతో కళ కళలాడుతూ పేదప్రజల రక్తం తాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఇచ్చి, పార్టీ హామీలను నమ్మిన ప్రజలను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తే ఇదివరకే హెచ్చరించినట్లుగా, బీజేపీ ప్రజా పోరాటం చేస్తుందని, ఎన్నికల వరకు సిండికేట్ కాదని బిజెపికి తెలుసని, రాజకీయ సమీకరణాలు మారి సిండికేట్ మాఫియాకు లొంగి నిర్ణయం తీసుకుంటే మాత్రం స్థానిక ఎమ్మెల్యేకి తీవ్ర రాజకీయ నష్టం జరుగుతుందని బీజేపీ తరఫున ఆయన విజ్ఞప్తి చేశారు. సిండికేట్ మాఫియాను బీజేపీ వ్యతిరేకిస్తుందని, ఇప్పుడు ఎలా నడుస్తున్నాయో వైన్ షాప్ లు అలాగే ఉండాలని ప్రజల తరఫున దోమల మహేశ్వర్ డిమాండ్ చేశారు.

# న్యాయవాదిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

## - తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి
## - జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, ఫిబ్రవరి 14 : హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు, తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కొత్తగూడెంలో మాట్లాడుతూ, న్యాయవాదుల రక్షణ చట్టం లేకపోవడం మూలంగా న్యాయవాదులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా ఎంతమంది న్యాయవాదులపై దాడులు జరిగి,ఎంతమంది న్యాయవాదులు చనిపోయిన తర్వాత న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేస్తారని ప్రశ్నించారు??. 15రోజుల వ్యవధిలో రాష్ట్రంలో ఇద్దరు న్యాయవాదులు హత్యకు గురికావడం హేయమన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడులుగా అభివర్ణించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, హోమ్ శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాంతి భద్రతల విషయంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# రాజధానికి చేరిన రామగుండం రాజకీయాలు

## - ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఆధ్వర్యంలో సీఎంను కలిసిన గెలిచిన కార్పొరేటర్లు - మేయర్ పీఠం పైన అందరి దృష్టి..! - 46వ డివిజన్ కార్పొరేటర్ - మహంకాళి స్వామికి అవకాశం ? - మరో ఇద్దరు, ముగ్గురు పేర్ల పరిశీలన - మహిళకు అవకాశం అంటూ ప్రచారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి, 14 : రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికల ఫలితాలు వెలువడడంతో రామగుండం రాజకీయాలు హైదరాబాద్ కు చేరుకున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 38 మంది అభ్యర్థులు విజయకేతనం ఎగరవేశారు. ఇదిలా ఉండగా బిఆర్ఎస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ల నుండి గెలిచిన అభ్యర్థులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం కొంతమంది రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేరగా మరి కొంతమంది రాష్ట్ర రాజధాని హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంకా బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచినా కార్పొరేటర్లు మరికొందరు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా శనివారం కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన కార్పొరేటర్లతో పాటు వివిధ పార్టీల నుండి వచ్చి చేరిన కార్పోరేటర్లు అందరూ కలిసి హైదరాబాద్ కు శనివారం పయనమయ్యారు. ఒకటి రెండు ప్రైవేటు బస్సుల ద్వారా వీరందరూ రాష్ట్ర రాజధాని కి తరలి వెళ్లారు. కార్పొరేటర్లు వారి కుటుంబ సభ్యులతో పాటు ఈ బస్సులలో బయలుదేరారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఆధ్వర్యంలో గెలిచిన కార్పొరేటర్ లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.కాగా మేయర్ పీఠం ఎవరిని వరిస్తుంది అన్నదానిపై ప్రజల దృష్టి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా రామగుండం రాజకీయాల్లో ఎన్ఎస్ యు ఐ నుండి రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మహంకాళి స్వామి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. గతంలో రెండు సార్లు కార్పొరేట్ గా గెలిచిన మహంకాళి స్వామి మూడోసారి కూడా ఎన్నికై సంచలనం సృష్టించారు. మూడు వివిధ డివిజన్లో అభ్యర్థిగా పోటీ చేసి మహంకాళి స్వామి గెలవడం గమనార్హం. ఎప్పుడూ కూడా కాంగ్రెస్ పార్టీని వీడని మహంకాళి స్వామి పార్టీ కష్టాల్లో ఉ న్నప్పుడు కూడా పార్టీని అంటిపెట్టుకొని ఉండడం జరిగింది. రెండేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మక్కాన్ సింగ్ గెలుపులో కూడా మహంకాళి పాత్ర ఎనలేనిది. దాంతో మహంకాళి స్వామికే మేయర్ పీఠం వరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం కొనసాగుతోంది. కాగా అత్యంత భారీ మెజారిటీతో గెలిచిన నెల కంటి రామ్ పేరు కూడా పరిశీలన ఉన్నట్టు ప్రచారం సాగుతోంది.దీనికి తోడు మరొక ఇద్దరు పేర్లను కూడా పరిశీలించే అవకాశం ఉండగా, ఒక మహిళకు కూడా అవకాశం ఇస్తున్నట్లుగా ఇక్కడ జోరుగా ప్రచారం కొనసాగుతోంది.ఫిబ్రవరి16 న మేయర్ ను ఎన్నుకోవడం కోసం మున్సిపల్ కమిషనర్ కార్యాలయం లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా మేయర్ లను, చైర్మన్ లను సోమవారం 11 గంటలకు ఎన్నుకోవడం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. కాగా కార్పొరేటర్ లందరూ ఫిబ్రవరి 16 న ఉ దయం 11గంటల కు ముందు రామగుండం మున్సిపల్ కార్యాలయంకు నేరుగా చేరుకునే విధంగా ఎమ్మెల్యే ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా మేయర్ అభ్యర్థి ఎవరనేది సీల్డ్ కవర్లో ఉ ంచి పంపించనున్నట్లు తెలుస్తోంది. రామగుండం మేయర్ పీఠాన్ని అధిష్టించేది ఎవరు అనేది ఫిబ్రవరి 16న తేలనుంది.

# క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల ఫిబ్రవరి 14 : క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు అలవాడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో కొనసాగుతున్న సి. ఎం. కప్ 2025 పోటీలకు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి అధికారులు, క్రీడాకారులతో కలిసి హాజరయ్యారు.

ఈహొసందర్భంగా జిల్లా కలెక్టర్హొమాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సి ఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని, క్రీడలతో ప్రశాంతత అలవాటు అవుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో టీం వర్క్ ప్రాధాన్యత తెలుస్తుందని, కలిసి పని చేయడంతో ఏదైనా సాధించవచ్చు తెలిపారు. క్రీడలలో గెలుపు, ఓటములు సామాన్యమని, క్రీడా స్ఫూర్తితో ఆటలలో పాల్గొనాలని తెలిపారు. ఒకసారి ప్రయత్నించి రాలేదు అని నిరుత్సాహపడకుండా సాధించే వరకు ఫలితం ఆశించకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని తెలిపారు. సి.ఎం. పోటీలలో భాగంగా గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి స్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని, అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, జిమ్నాస్టిక్స్, రూలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో సిబ్బంది సహకారం తక్కువగా ఉన్నప్పటికీ జిల్లాలో క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఒలంపిక్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా సాధించవచ్చు అని, క్రీడాకారులు ఏకాగ్రతతో శిక్షణ పొంది క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోహొహొసంబంధిత అధికారులు, వివిధ క్రీడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# "కెవైసి - సురక్షిత బ్యాంకింగ్ వైపు మీ మొదటి అడుగు"

## భద్రాచలంలో వాకతాన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాచలం, ఫిబ్రవరి 14: "కెవైసి – మీ బ్యాంక్ ఖాతాను సురక్షితంగా ఉంచడంలో మీ మొదటి అడుగు" అనే ఇతివృత్తంతో, భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఫిబ్రవరి 9 నుండి 13 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా, భద్రాద్రి జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం పట్టణంలో వాకతాన్ నిర్వహించారు. ఫ్లెక్సీలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ కె.వై.సి. నవీకరణ చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. "తెలియని లింకులు నొక్కొద్దు-ఓ.టి.పి.లు చెప్పొద్దు-మోసగాళ్ళకు చిక్కొద్దు" అంటూ నినాదాలు చేస్తూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి. రామి రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ కె. వై.సి. అప్ టు డేట్ గా ఉంచుకోవాలని సూచించారు. కె.వై.సి.కి అవసరం అయిన డాక్యుమెంట్లు, అవి బ్యాంక్ ఖాతా కు అనుసంధానం చేయడం వల్ల కలిగే లాభాల గురించి ప్రజలకు వివరించారు. ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా అన్నిటిలో పేరు, చిరునామా, పుట్టిన తేదీ ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆధార్ కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు ఒక బ్యాంక్ లో కె.వై.సి అప్డేట్ చేయడం ద్వారా మిగిలిన అన్ని బ్యాంకులలో కె. వై.సి. అప్డేట్ చేసే వ్యవస్థ సి.కె.వై.సి. అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ విధానంలో 14 అంకెల సి.కె.వై.సి. నంబర్ జారీ చేస్తారని, ఈ నంబర్ మిగిలిన అన్ని బ్యాంకులలో ఉన్న ఖాతాకు అనుసంధానం చేయడం ద్వారా కె.వై.సి. అప్డేట్ అవుతుందని ఆయన వివరించారు. ఆ తరువాత కెవైసీ అన్ని డాక్యుమెంట్ల సమర్పించే అవసరం లేదని, 7799022129 కి కస్టమర్ రిజిస్టర్డ్ మొబైల్ నుండి మిస్డ్ కాల్ చేయడం ద్వారా కె.వై.సి. నంబర్ సులభంగా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. కె.వై.సి. పేరుతో ఫోన్ ద్వారా, ఆన్లైన్ లింకుల ద్వారా జరుగుతున్న మోసాల గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భద్రాచలం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మధుసూదన శర్మ మాట్లాడుతూ, ఖాతాదారులు తమ కె.వై.సి అప్ డేట్ చేసుకోవడం ద్వారా సురక్షితమైన బ్యాంకింగ్ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. ఒక వేళ, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి ఫోన్ చేసి కంప్లైంట్ చేయాలని సూచించారు. ఎస్.బి. ఐ.రీజినల్ ఆఫీస్ మేనేజర్ (ఎఫ్.ఐ) భాను పద్మశ్రీ మాట్లాడుతూ, వాట్సాప్ ద్వారా ఆకర్షణీయమైన పేర్లతో .ఏపీకే ఫైల్స్ వస్తున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని సూచించారు. ఏ పేరుతో వచ్చినా, ఏపీకే అని కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, సి.ఎఫ్.ఎల్ భద్రాచలం సిబ్బంది లక్ష్మణ్, హరిబాబు, జీవన రేఖ, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

## - ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
## - టీడబ్ల్యూజేఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు అంబటి స్వామి డిమాండ్
## - 17నఛలో సమాచార భవన్"కు పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన "ఛలో సమాచార భవన్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వనపర్తి జిల్లా అధ్యక్షులు అంబటి స్వామి తెలిపారు. ఈ నెల 17న 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం (సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వాహకులు,హొజర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, ఛానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.

గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్‌తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న, మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్ల యినా అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకుహొ అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారన్నా రు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్‌తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రెడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమినిహొ ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.







# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

**- సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్. శ్రీనివాస్ రాజ్ - భీమేశ్వర ఆలయంలో పూజలు**

**- ఆర్టీసీ ఉచిత రవాణా బస్సు ప్రారంభం - రాజన్న ఆలయ విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, ఫిబ్రవరి 14 : రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

**ఆలయ విస్తరణ పనుల పరిశీలన**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

**ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం**

వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

**ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్అండ్ బీసీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



# పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ఏసీఎంఓ ఉద్ధవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 : పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. శనివారం ఆశ్రమ పాఠశాల బాలికల వాంకిడి లో గల 10వ తరగతి విద్యార్థినిలకు మోటివేషనల్ స్పీకర్ సుందిళ్లరమేష్ ద్వారా మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏంఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా సబ్జెక్ట్ నిపుణులచే పదవ తరగతి విద్యార్థులకు ప్రశ్నాపత్రం పై అవగాహన పరచడం, పదవ తరగతిలో సులభంగా ఏవిధంగా ఉత్తీర్ణులు కావడం, అత్యధిక మార్కులు ఏ విధంగా సాధించాలి అనే అంశాలపై తర్ఫీదు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎసిఎంవో ఉద్ధవ్, హెడ్ మాస్టర్ ఏం. నారాయణ మూర్తి ,వసతి గృహ సంక్షేమ అధికారి మంగవతి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# పుల్వమా అమరవీరులకు నివాళి

**ఉప్పల్ జిల్లా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి (ఘట్కేసర్), ఫిబ్రవరి 14 : 2019 ఫిబ్రవరి 14న పుల్వమాలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలర్పించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల వీరోచిత త్యాగాన్ని స్మరిస్తూ, బజరంగ్ దళ్ ఉప్పల్ జిల్లా వేంకటాద్రి ప్రఖండ ఆధ్వర్యంలో "వీర జవాన్ దివాస్" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం వేంకటాద్రి టౌన్‌షిప్ నుండి నారపల్లి చౌరస్తా వరకు కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా సహ సంయోజక్ ఏర్పల రాజు ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బజరంగ్ దళ్ లేదా విశ్వహిందూ పరిషత్ ప్రేమకు వ్యతిరేకం కాదని, కేవలం పాశ్చాత్య సంస్కృతి పేరుతో జరిగే వికృత చేష్టలకే వ్యతిరేకమని స్పష్టం చేశారు. సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతులే మనకు నిజమైన ప్రేమకు ఆదర్శమని పేర్కొన్నారు. కేవలం ఒక్కరోజు పార్కులు, పబ్బుల చుట్టూ తిరగడం ప్రేమ కాదని, విదేశీ సంస్కృతిని విడనాడి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకోవాలని ఆయన కోరారు. యువత కాంట్రాక్ట్ మ్యారేజ్, విడాకుల వంటి పద్ధతులకు దూరంగా ఉండి, భారతీయ సంప్రదాయబద్ధంగా జీవితాంతం కలిసి ఉండటమే నిజమైన ప్రేమ అని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రఖండ సంయోజక్ పొడిశెట్టి సాత్విక్, సహ సంయోజకులు శుభమ్ దేవా, అర్జున్, సురక్ష ప్రముఖ్ నిక్షయ్, సప్తయిక్ ప్రముఖ్ ఈశ్వర్, బలోపాసన ప్రముఖ్ నితీష్, విద్యార్థి ప్రముఖ్ నిర్ణయ్, గౌరక్ష ప్రముఖ్ లింగంతో పాటు బజరంగ్ దళ్ కార్యకర్తలు సాయి, సాహిత్, చక్రి, కార్తీక్, కుమార్, శ్రవణ్, శ్రవణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 17న సేవాలాల్ మహారాజ్ 287వ జయంతినీ జయప్రదం చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్ లో ఈ నెలా 17వ తేదీ మంగళవారం నిర్వహించే సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సేవలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ జిల్లాఅధ్యక్షులు చౌహన్ గునవంత్ రావ్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం లింగాపూర్ మండలం లోని వివిధ గ్రామాల నాయక్, కారోబారి, గ్రామస్తులు ను కలిసి అవ్హానించారు. ఈసందర్బంగా లింగాపూర్ మండల కేంద్రంలో ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు చౌహన్ గునవంత్ రావ్ ని లింగాపూర్ గ్రామస్తులు శాలువా తో సన్మానించారు. గ్రామస్తులు అందరు కలిసి జయంతి కి రావాలని ఆహ్వాన పత్రిక ఇచ్చారు. తదనంతరం లింగాపూర్ మండలం లోని గోపాల్ పూర్ ,రామునాయక్ తాండ,ఫూల్ సింగ్ నాయక్ తండా, ఖిమానాయక్ తండా రాఘపూర్, నడ్డంగూడా, కొత్తపల్లి, మామిడపల్లి, హిరాపూర్, శాంతి నగర్, కొత్తపల్లి గ్రామాల తండా నాయకులు తో ఏర్పాటు చేసిన సమావేశంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బంజారాల జాతిపిత, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని తండాల నుంచి సేవాలాల్ మహారాజ్ భావి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. జయంతి వేడుకలను



జయప్రదం చేయడానికి ప్రతి గ్రామ నాయక్, కారోభారీ, డావ్, హాసాబీ, నసాబీ, ప్రజా ప్రతినిధులు మాజీ జెడ్పీటీసీ,లు. నూతన సర్పంచులు,మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు, జాతి పెద్దలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, యువత, ఉద్యోగస్తులు, ప్రతి ఒక్కరు బాధ్యతగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లాశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ నాయకులు రాథోడ్ బలిరామ్ నాయక్, జాదవ్ గణపత్ నాయక్, జాదవ్ రాజశేఖర్, నూణావత్ గోవింద్, జాదవ్ రమేష్ ,బానోత్ రాంచందర్ ,రాథోడ్ గులాబ్ ,జాదవ్ మంగులాల్ ,రాథోడ్ సిరి నాయక్ చౌహాన్ రామునాయక్, పంవర్ సంతోష్, రాథోడ్ మంగులాల్, రాథోడ్ రవీందర్, పద్మావత్ చిరంజీవి, జాదవ్ బలిరామ్ నాయక్, జాదవ్ లోకేందర్ ,జాదవ్ నాను, హటియా, నాయక్, నూణావత్. గోపాల్, జాటోత్ రాహుల్, జాదవ్ సంజీవ్, చౌహన్ నాందేవ్, జాదవ్ దేవిదాస్, ఆడే జైపాల్, జాదవ్,అంబాజీ, జాదవ్ ఇందల్, ఆడే అనిల్, జాదవ్ ప్రేమసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ ఎంపికలో సామాజిక న్యాయం తప్పనిసరి

- **జనరల్ స్థానాలు కొంతమందికే రిజర్వేషన్ కావు**
- **భువనగిరి చైర్మన్ పదవి బీసీలకే ఇవ్వాలి**
- **బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో విజయం సాధించడం వారి ఐక్యత, రాజకీయ చైతన్యానికి నిదర్శనమని అన్నారు. మొత్తం కౌన్సిలర్ల, కార్పొరేటర్లలో సుమారు 60 శాతం మంది బీసీలు గెలవడం అభినందనీయమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కలిపి దాదాపు 85 శాతం స్థానాలు దక్కించుకోగా, అగ్రకులాలు చాలా తక్కువ శాతానికి పరిమితమయ్యాయని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో చైర్మన్, మేయర్ పదవుల్లో కూడా అదే నిష్పత్తి అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అధిక మున్సిపాలిటీల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ కనీసం 60 చైర్మన్ స్థానాలు బీసీలకు కేటాయించాలని, భారత రాష్ట్ర సమితి కూడా తగిన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎవరి వాటా వారికే దక్కాలన్న రాహుల్ గాంధీ సూత్రాన్ని కాంగ్రెస్



అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని సామాజిక న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జనరల్ స్థానాలు అనగానే కొంతమంది అగ్రకులాలకు మాత్రమే పరిమితం చేస్తున్న తీరు సరికాదని విమర్శించారు. మెజార్టీగా బడుగు, బలహీన వర్గాలే గెలిచిన మున్సిపాలిటీల్లో ఒకరు, ఇద్దరు గెలిచిన అగ్రకులాలకు చైర్మన్ పదవులు కట్టబెట్టాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. భువనగిరిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కౌన్సిలర్లు అధిక సంఖ్యలో గెలిచారని, అయినప్పటికీ బీసీలను పక్కన పెడితే తీవ్ర ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. బీసీలకు అన్యాయం చేసే ఎమ్మెల్యేలను, పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటించి రాజకీయంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, కార్యనిర్వాక అధ్యక్షులు బాబురావు, నియోజకవర్గ అధ్యక్షులు సాబన్ కార్ వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ రాష్ట్ర నాయకులు బత్తిని రాజు గౌడ్, జాజుల లింగం, వెంకన్న, రమేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్, ఇంద్రం రజక, భువనగిరి మండల అధ్యక్షులు జిన్న మల్లేష్ ముదిరాజ్ , యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు అశోక చారి, మోహన్, రాజు, పాల్గొన్నారు.

# బదిలివర్కర్లకు జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గా అపాయింట్ మెంట్ ఆర్డర్

**-ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 14 : సింగరేణిలో పని చేస్తున్న బదిలీ వర్కర్ లకు మార్చి 2026 నుండి జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గా అపాయింట్మెంట్ ఆర్డర్ లు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. సింగరేణి లో బదిలీ వర్కర్ నుంచి జనరల్ అసిస్టెంట్ గా మారాలంటే గతంలో కనీసం మూడు సంవత్సరాల సమయం పట్టెదని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను గుర్తింపు సంఘం ఏఐటియుసి యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడి ఒప్పించి మార్చి 2026 నుండి బదిలి వర్కర్ కు బదులు గా జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గా అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చే విధంగా ఒప్పించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం బదిలీ వర్కర్లు గా పనిచేస్తున్న వారిని,భవిష్యత్తులో రిక్రూట్మెంట్ అయ్యేవారికి కూడా జనరల్ అసిస్టెంట్ ట్రైనిగా ఇస్తారని ఆయన తెలిపారు. 190/240 మస్టర్లు పూర్తి కాగానే ట్రైని తీసేసి జనరల్ అసిస్టెంట్ గా మారుస్తారని ఆయన పేర్కొన్నారు. కాగా బదిలీ వర్కర్లందరు ఏఐటీయుసి కృషి ని గమనించగలరని ఆయన పేర్కొన్నారు.

# ప్రకృతి మాతను కాపాడుకుందాం

**- జీవరాశి కనుమరుగయ్యే కాలం ఆసన్నమైంది**

**- ప్రముఖ ప్రకృతి కవి జయరాజు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి14 : ఈ భూమిపైన సమస్త జీవరాశి కనుమరుగయ్యే కాలం ఆసన్నమైందని, ప్రకృతి మాతను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని, ప్రముఖ ప్రకృతి కవి రచయిత డాక్టర్.జయరాజ్ అన్నారు. విజ్ఞాన దర్శని, దీ నెహ్రూ సెంటర్, నేచర్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విజ్ఞాన యాత్రలో భాగంగా, యాత్ర బృందం శనివారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా ప్రకృతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ప్రకృతి ప్రేమికుల సమావేశంలో జయరాజ్ మాట్లాడుతూ..అనేక పోరాటాల త్యాగ ఫలితంగా స్వాతంత్రం సిద్ధించిందని, దాన్ని సఫలీకృతం చేసేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారని వెల్లడించారు. ఇటీవల రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర జరుగుతుందని, దాన్ని అర్థం చేసుకుని, రాజ్యాంగ రక్షణకు పాటుపడాలని కోరారు. ప్రపంచంలో క్యాన్సర్ వీరవిహారం చేస్తున్నదని, ప్రాణాంతకమైన క్యాన్సర్ని రూపుమాపేందుకు మనమందరం నిత్యజీవితంలో ప్లాస్టిక్ ని రూపు మాపాల్సిన అవసరం ఆసన్నమైందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రకృతి పైన, రాజ్యాంగం పైన, సైన్స్ పైన, అవగాహనను కల్పించాల్సిన అవసరం ఏర్పడిందని, దాని దానిలో అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు, ప్రజా వైజ్ఞానికవేత్త రమేష్ మాట్లాడుతూ సైన్సు సాంకేతిక రంగాలలో ప్రపంచం దూసుకుపోతుందని, ప్రస్తుతం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కాలం ఆసన్నమైంది కానీ, మనుషుల్లో మార్పు రాలేదన్నారు. ఒక మెకానికల్ ఇంజనీర్ తన కారుకి చిన్న నట్టు పోతే వేసుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఎలక్ట్రికల్ లో ఇంజనీరింగ్ పట్టాపుచ్చుకున్నవారు తన ఇంట్లో ఫ్యూజు పోతే వేసుకోలేని పరిస్థితి



ఉందని, దాన్నిబట్టి మనం చదివే చదువుల వల్ల ఉపయోగం ఏంటో అర్థం చేసుకోవాలని కోరారు. చదువులతో పాటు సమాజాన్ని చదవాలని అభివృద్ధి చెందుతున్న సైన్స్ ని అందిపుచ్చుకోవాలని అప్పుడు మాత్రమే మన జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. అనంతరం ప్రకృతి ఆశ్రమం సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ జయరాజుకు, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్,శోభారాణి దంపతులకు, అవయవ దానం పై అవగాహన కల్పిస్తున్న అమ్మ నేత్ర శరీర అవయవదాన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఈశ్వర్ లింగం లను ఆశ్రమ సభ్యులు ఘనంగా సన్మానించి, సత్కరించారు. కన్వీనర్ సుగుణా రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు కేహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ, విజ్ఞాన యాత్ర చేపట్టడం శుభదాయకమన్నారు. యాత్రకు కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని జాతీయ నాయకురాలు శోభారాణి, రాష్ట్ర కార్యదర్శి మెహర్ అలీ, ప్రకృతి ఆశ్రమం సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, మల్లెల రామనాథం, మొక్కల రాజశేఖర్, ఎల్దండి పూర్ణచంద్రరావు, దయానంద సాగర్, బంగారి శంకర్, బిక్కులాల్, నంది శశి కుమార్, శోభారాణి, రఘు లు పాల్గొన్నారు.



# 16న కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

**- సమయపాలన తప్పనిసరి - జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారాన్ని ఈ నెల 16న నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ ఎన్నికల స్పెషల్ అధికారులతో, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు అన్ని మున్సిపాలిటీల్లో ఒకేసారి ప్రమాణ స్వీకారం జరిగేలా పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధి విధానాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. భువనగిరికి అధికృత అధికారిగా భాస్కర్ రావు, యాదగిరిగుట్టకు నాగిరెడ్డి, పోచంపల్లికు విష్ణువర్ధన్ రెడ్డి, ఆలేరుకు కృష్ణారెడ్డి, చౌటుప్పల్కు శేఖర్ రెడ్డి, మోత్కూర్కు సురేష్‌ను నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం



# రామగుండం కార్పొరేషన్ కార్పొరేటర్ల విజయం

## కార్యకర్తలకు అంకితం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఫిబ్రవరి 14 : రామగుండం కార్పొరేషన్ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ అభ్యర్థులు మెజార్టీగా గెలిపించిన అన్ని డివిజన్ల ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ సర్కార్ సీఎం ప్రధాన సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కార్పొరేట్ మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించడం పట్ల మా బాధ్యతను మరింత పెంచిందని హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనకు ప్రజల సంపూర్ణ ఆమోదం లభించిందని దానికి ఇది నిదర్శనమని ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేణుగోపాల్ రావు అన్నారు. ఈ విజయం పార్టీ జెండా మోసిన కార్యకర్తలందరికీ అంకితమని అన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి-భువనగిరి, ఫిబ్రవరి 14 : ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని శనివారం ఉదయం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దర్శించుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ప్రజలందరి సుఖసంతోషాలు, నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర శ్రేయస్సు కోసం స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్వామి వారి కృపతో రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. దర్శనానంతరం ఎమ్మెల్యేకు ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచన మండపంలో వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు.



## కంపెనీ ఆస్తులను కాపాడడంలో

# సదానందంను ఆదర్శంగా తీసుకోవాలి

## - సెక్యూరిటీ గార్డ్ సదానందంకు మందమర్రి జిఎం అభినందన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మందమర్రి, ఫిబ్రవరి 14 : సింగరేణి కంపెనీ ఆస్తులను కాపాడడంలో ప్రతి ఒక్కరు సదానందంను ఆదర్శంగా తీసుకోవాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. మందమర్రి కేకే ఓసి గనిలో స్క్రాప్ దొంగతనానికి యత్నించిన వారిని ఎంతో ధైర్య సాహసాలతో ఎదుర్కొన్న సీనియర్ సెక్యూరిటీ గార్డ్ ను జిఎం అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దొంగిలించబడిన వస్తువులను పట్టుకున్న పెద్దపల్లి సదానందంతో సెక్యూరిటీ పాటు ఎస్ అండ్ పిసి, మొబైల్ టాస్క్ ఫోర్స్ సభ్యులను జిఎం అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, జూనియర్ ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, జమ్మిదార్ లక్ష్మణ్, ఇంటిలిజెంట్స్ గార్డు కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.



# గ్రామాల సమన్వయంతో సేవాలాల్ జయంతి వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కేశంపేట ఫిబ్రవరి 14 : రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రంలో నేడు నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్వహణ కమిటీ సభ్యులు శనివారం నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మేరకు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలు, సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వేడుకలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పాల్వంచలో శ్రీనివాసగిరిపై వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఫిబ్రవరి 14 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీ శ్రీనివాసగిరి గుట్టపైకి శనివారం భక్తులు పోటెత్తారు. రెండవ శనివారం సెలవు దినం కావడంతో అత్యధికంగా భక్తులు కుటుంబ సభ్యులతో సహా 1600 మెట్లు ఎక్కి గుట్ట పైకి చేరుకొని శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు గతంలో స్వామివారిని దర్శించుకుని వారి కోర్కెలు నెరవేరాయని మెట్ల మార్గంలోని పాదాల మండపం నుంచి శ్రీనివాసగిరి ప్రధాన ఆలయం వరకు మెట్లకు బొట్లు పెడుతూ గుట్ట పైకి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కి కొత్తగా ఎన్నికైన 4వ డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని అర్చకుల ఆశీర్వచనం పొందారు. నామినేషన్ వేసేటప్పుడు స్వామివారిని దర్శించుకుని నామినేషన్ వేయడం జరిగిందని, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపతో, డివిజన్ ప్రజల



ఆశీర్వాదంతో కార్పొరేటర్ గా ఎన్నికవ్వడం జరిగిందని తెలియజేశారు. అర్చకులు ఆరుట్ల ఫణి రాజా చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్ష కార్యదర్శులు ఊకే భద్రయ్య, తాటికొండ శ్రీలత, కోశాధికారి పిట్ట లక్ష్మీరెడ్డి, సేవా ట్రస్టు కార్యదర్శి లక్ష్మణాచార్యులు, సహాయక కార్యదర్శి ఏటుకూరి నరేష్, సేవాదళ్ అధ్యక్ష కార్యదర్శులు కొండ్రు శివ, పరిశిక కిరణ్, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు నిడమనేని అనూష, రేనాటి స్రవంతి, భక్త సమాజ మండలి సభ్యులు పాల్గొన్నారు.




# అందుబాటులో సమాచారం... అన్ని సేవలు...

## - అన్ని మార్గాలు, రద్దీ ప్రదేశాలు, చోట్ల సైన్ బోర్డ్ లు ఏర్పాటు
## - క్యూలైన్లు ఇతర చోట్ల స్టీల్ గ్లాసుల్లో తాగునీటి వసతి
## - బేబీ ఫీడింగ్ సెంటర్ అందుబాటులోకి..
## - దివ్యాంగులు, వృద్ధులకు సహాయంగా వీల్ చైర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, ఫిబ్రవరి 14 : మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని చోట్లా పూర్తి సమాచారం ఏర్పాటు చేశారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక ప్రకారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇలా ప్రతి చోట జిల్లా అధికారిని ఇన్చార్జిగా నియమించారు. అలాగే జాతర పరిసర ప్రాంతాల్లో 10 హెల్ప్ డెస్క్ లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే రెండు సార్లు సంబంధిత అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశాలు నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.

**బేబీ ఫీడింగ్ రూమ్**

చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా బేబీ ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సదుపాయాలు కల్పించారు. తల్లులు ప్రశాంతంగా పిల్లలకు పాలు ఇవ్వడానికి ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

**దివ్యాంగుల, వృద్ధుల కోసం వీల్ చైర్లు**

దివ్యాంగ,వృద్ధ భక్తులు స్వామివారి దర్శనానికి సులభంగా చేరుకునేలా వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, హెల్ప్ డెస్క్‌ల వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించారు. అవసరమైన సహాయాన్నివెంటనే అందించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు 100 వీల్ చైర్లు అందుబాటులో ఉన్నాయి.

**త్రాగునీటి కోసం స్టీల్ గ్లాసులు**

భక్తులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్నారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏర్పాటు చేశారు. అన్ని త్రాగునీటి కేంద్రాలు, క్యూ లైన్లలో గ్లాసుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

**సూచిక బోర్డులు**

భక్తులు దారి తప్పకుండా దర్శన మార్గాలు, క్యూలైన్లు, మరుగుదొడ్లు, త్రాగునీటి కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. తెలుగులో బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

**హెల్ప్ డెస్క్**

భక్తుల సమస్యలు, సందేహాలకు వెంటనే స్పందించేందుకు 10 హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. దర్శన సమయాలు, వసతి, వైద్య సహాయం, దివ్యాంగుల సదుపాయాలు తదితర సమాచారం ఇక్కడ పొందవచ్చని అధికారులు తెలిపారు.

**పారిశుధ్య నిర్వహణ**

పంచాయితీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో దేవస్థానం పరిసరాలు, ప్రధాన రహదారులు, క్యూలైన్లు, మరుగుదొడ్ల వద్ద పారిశుధ్య పనులను విస్తృతంగా చేపట్టారు. చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులు నిరంతరంగా కొనసాగించేలా ప్రత్యేక సిబ్బంది, వాహనాలను నియమించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**వైద్య శిబిరాలు**

భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అత్యవసర చికిత్స, ప్రాథమిక వైద్య సేవలు, మందుల పంపిణీ కోసం వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అనారోగ్యం, గాయాలు తదితర సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గుడి ఆవరణలో వైద్య సిబ్బంది, అగ్ని మాపక సిబ్బంది ఉన్నారు.

**కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ**

జాతర ఏర్పాట్లు, సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.సీసీ కెమెరాల సహాయంతో భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతకరం

## ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది

(ప్రజాలక్ష్యం బ్యూరో)

ద్రాక్షారామం, ఫిబ్రవరి 14 : శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి. అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి. మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి, ఉడికిన పదార్థాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని చెప్తారు.

# షీ టీమ్ డెకాయ్ ఆపరేషన్‌తో వెకిలి చేష్టలకు చెక్!

## - ప్రేమికుల దినోత్సవం వేళ ఐదుగురు
## - ఆకతాయిలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబాటు

(ప్రజాలక్ష్యం బ్యూరో)



మంచిర్యాల ఫిబ్రవరి 14 : మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు పార్క్, బస్ స్టాండ్ ప్రాంతాల్లో వెకిలి చేష్టలకు పాల్పడుతున్న ఐదుగురు ఆకతాయిలను మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది డెకాయ్ ఆపరేషన్ ద్వారా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో, రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఆధ్వర్యంలో శనివారం ఈ ఆపరేషన్ నిర్వహించగా, నిందితులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేసి కఠిన హెచ్చరికలు జారీ చేసినట్లు మంచి ర్యాల షీ టీమ్ ఎస్సై ఉషారాణి తెలిపారు. విద్యార్థినులు లేదా మహిళలు ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100, రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700 కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ డెకాయ్ ఆపరేషన్‌లోఎస్సైతో పాటు షీ టీమ్ సిబ్బంది శ్రవణ్, సతీష్, జ్యోతి, శ్రీలతలు పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

## - అలరించిన నృత్యాలు, ప్రదర్శనలు
## - ప్రారంభించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, ఫిబ్రవరి 14 :మహా శివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన శివార్చన స్టేజిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శనివారంప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శనలు అలరించాయి. అంతకముందు బేబీ ఫీడింగ్‌సెంటర్‌ను ఇంచార్జి కలెక్టర్ ప్రారంభించారు. క్యూ లైన్లలో ఏర్పాట్లు పరిశీలించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా ఏర్పాట్లుచేశామనిఇంచార్జికలెక్టర్ పేర్కొన్నారు.



# కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా

## - రైతులకు మెరుగైన సేవలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి14 : కాటారం వ్యవ సాయ మార్కెట్ కమిటీ ద్వారా ఈప్రాంత రైతులకు మెరుగైన సేవలు, అందించడానికి మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ప్రత్యేక కార్య చరణ తయారు చేయనున్నట్లు కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో వైస్ చైర్మన్, డైరెక్టర్‌లతో కలిసి రాబోవు రోజుల్లో చేపట్టాల్సిన పనులను గూర్చి చర్చించారు. మారుమూల గ్రామీణ పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమా దమునందున ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తీర్మానించారు. మార్కెట్ యార్డ్ లో రైతుల సౌక ర్యార్థం సిసి ప్లాట్ ఫామ్లు మరుగుదొడ్లు నిర్మించాలని తీర్మానం చేశారు. పలువురు డైరెక్టర్లు సూచన మేరకు అనేక అంశాలపై తీర్మానాలు చేశారు.మార్కెట్ యార్డు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్న శ్రీధర్ బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు వారు తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీ లాషరీఫ్, డైరెక్టర్లు మహేష్ తిరుపతి రావుతో పాటు పరువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



# ముగిసిన సీఎం కప్ జిల్లా పోటీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఫిబ్రవరి 14 : కరీంనగర్ జిల్లా స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ క్రీడా పోటీలను స్థానిక అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ట్రోఫీతో పాటు పతకాలు ప్రదానం చేసారు. జిల్లా స్థాయిలో జరిగిన టోర్నమెంటులో హ్యాండ్ బాల్ బాలుర విభాగంలో రామడుగు మొదటి స్థానంలో నిలువగా, కబడ్డీ మహిళా విభాగంలో కరీంనగర్ కు మొదటి స్థానం లభించింది. అలాగే ఖో ఖో మహిళా విభాగం మొదటి స్థానం చొప్పదండి కైవసం చేసుకుంది. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 17 నుండి 23 వరకు వివిధ జిల్లాలలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లో పాల్గొంటారు. కరీంనగర్ జిల్లాను రాష్ట్రస్థాయి పోటీలలో అగ్రగామిగా నిలపాలని డివైస్ ఓబి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీఎస్ పేట సంఘం జిల్లా అధ్యక్షులు బాబు శ్రీనివాస్, కార్యదర్శి, టీజీపేట జిల్లా అధ్యక్షులు అంతటి శంకరయ్య, కార్యదర్శి చిరుత శ్రీనివాస్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# సింగరేణి డాక్టర్ల నిర్లక్ష్యం ఖరీదు...యువకుడు నవీన్ ప్రాణం బలి

- యువకుడి శవంతో సింగరేణి ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన
- నవీన్ కుటుంబానికి మద్దతుగా సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి.
- అంబులెన్స్ లో ఎస్కార్ట్ లేకుండా హైదరాబాద్ కు రిఫర్ చేసారని ఆరోపణ.
- ఊపిరాడక మార్గమధ్యంలోనే ప్రాణంవదిలిన వైనం.
- సింగరేణి వైద్యం గొప్పలు ప్రచారానికే పరిమితం.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి 14 : భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సింగరేణి ప్రదాన ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సింగరేణి ఉద్యోగి కుమారుడి ప్రాణం పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సింగరేణి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని ఎమర్జెన్సీ కేసులను సైతం హైదరాబాదులోని పెద్ద ఆసుపత్రుల్లో ఆధునిక చికిత్సలు అందిస్తున్నట్లు యాజమాన్యం ప్రచారం చేయడం తప్ప కార్య రూపంలో శూన్యంగా కనిపిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. అందుకు నిదర్శనం నవీన్ మరణమే అని బాహాతంగానే చర్చించుకుంటున్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా 5 షాఫ్ట్ లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగి బాల నాగేశ్వరరావు కుమారుడు నవీన్ (29) స్థానిక సింగరేణి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శనివారం మరణించాడని ఆరోపణలు వస్తున్నాయి. మూడేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నవీన్ ను తల్లిదండ్రులు కంటికి రెప్పలా చూసుకుంటూ, తనయుణ్ణి కాపాడుకునేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సింగరేణి అందిస్తున్న వైద్యంపై భరోసాతో డాక్టర్ల ప్రతి సూచనలు పాటిస్తూ వస్తున్న ఆ కుటుంబానికి వైద్యుల నిలువెత్తు నిర్లక్ష్యం షరాఘాతంగా మారింది. నవీన్ ప్రాణాలు కోల్పోవడంతో తీవ్ర కడుపుకోతకు గురైన ఆ కుటుంబంతో పాటు ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సింగరేణి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. నవీన్ ఆరోగ్యం క్షీణించడంతో ఇక్కడి ప్రధాని ఆసుపత్రి నుంచి హైదరాబాద్ లో చికిత్స కోసం రిఫర్ చేశారు. ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ లో తరలిస్తున్న క్రమంలో ఖమ్మం సమీపంలోని పల్లిపాడు వద్ద ఊపిరి ఆడక అంబులెన్స్ లోనే నవీన్ చాలా విషాదంగా మృతి చెందాడు. అత్యవసర పరిస్థితి ఉందని వైద్యులకు తెలిసినప్పటికీ ఆక్సిజన్ ఆపరేటర్స్ ఏర్పాటు చేయలేకపోయారు. దానికి తోడు అంబులెన్స్ లో ఏసీ కూడా పని చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. అసలే తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న నవీన్ వెంట కనీసం వైద్య చికిత్సలో తర్ఫీదు ఉన్న ఒక ఎస్కార్ట్ ను పంపించాల్సి ఉంది. బీటెక్ చదువుకున్న నవీన్ కు ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్నట్లు తెలుస్తోంది. దానికి తోడు బోన్ క్యాన్సర్ కూడా సంక్రమించినట్లు తెలిసింది. ఇతనికి కీమో చికిత్సలు కూడా పూర్తిస్థాయిలో అందాయి. ఎంతో కొంత కోలు కుంటున్న దశలో, హైదరాబాద్ వైద్యుల సూచన మేరకు హ్యూమానిటీ ఇంజక్షన్లు ఇవ్వాల్సిందిగా సింగరేణి వైద్యులకు సూచనలు చేసారని అయినప్పటికీ నిర్లక్ష్యం చేశారని ససేమీరా ఆ ఇంజక్షన్లు చేయమని వైద్యులు తిరస్కరించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొడుకును ఎంతో గారాబంగా చూసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలలుగన్న తల్లిదండ్రుల ఆశలను సింగరేణి వైద్యులు తమ నిర్లక్ష్యంతో కడుపుకోతను మిగిల్చారని విమర్శలు వస్తున్నాయి. మూడేళ్లుగా చికిత్స తీసుకుంటున్న నవీన్ ఎంతో కొంత కోరుకుంటున్నారని తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇలాంటి క్రిటికల్ కేసుల విషయంలో అంబులెన్స్ ఏర్పాటు శాస్త్రీయంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా చాలా నిర్లక్ష్యం చేశారని దీంతో యువకుడి ప్రాణాలు కోల్పోయాడని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, హుమాయున్ ఆరోపిస్తున్నారు. యువకుడి శవంతో సింగరేణి ఆసుపత్రి వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో వీరు మద్దతుగా నిలబడ్డారు. ఎమర్జెన్సీ కేసు విషయంలో అంబులెన్స్ లో సి.ఆర్.పి. తో పాటు ఆక్సిజన్ ఆన్ చేసి ఉంచాలని ఒక తర్ఫీదు పొందిన సిబ్బంది ఎస్కార్ట్ గా పంపించాల్సి ఉంటుందని నాయకులు వెల్లడిస్తున్నారు. స్థానిక వైద్యులు ఇవేమీ పట్టించుకోకుండా ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని అందుకే యువకుడు నవీన్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, కేంద్ర కౌన్సిల్ సభ్యులు హుమాయూన్, రాము, రాజేశ్వరరావు, నరేష్, మురళి, రవీందర్, శ్యామ్, పల్నాటి ప్రశాంత్, నాగయ్య, నితిన్, క్రిస్టఫర్, ఎర్రగాని కృష్ణ, ఓం, వాసు, మడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాదులో బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు - సిపీఐకి మద్దతు ఇచ్చే అవకాశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి 14 : బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు ఎవరికి అమ్ముడుపోరనీ, బీఆర్ఎస్ అధినేతలు కెసిఆర్, కేటీఆర్ నిర్ణయమే తమకు శిరోధార్యమని కొత్తగూడెం కార్పొరేషన్ బిఆర్ఎస్ కార్పొరేటర్లుస్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు శనివారం సమావేశమై, సోషల్ మీడియాలో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయారని గ్లోబల్ ప్రచారం చేస్తున్న విషయాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది కార్పొరేటర్లు మాట్లాడుతూ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ నిర్ణయం మేరకు సిపిఐ పార్టీతో పొత్తు ఉంటుందని, అదేవిధంగా ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరూ ఏకతాటిమీద ఉంటామని ప్రమాణం చేశారు. ఇలా ఉండగా బీఆర్ఎస్ కార్పొరేటర్ లు హైదరాబాద్ లో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపు లో ఉన్నట్లు తెలుస్తోంది.



# భద్రాద్రి నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్

- వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 14 మంది ఎంపిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి 14 : భద్రాద్రిజిల్లాస్థాయి సీఎం కప్–2026 పోటీల్లో భాగంగా శనివారం భద్రాద్రి జిల్లా పాల్వంచలోని మినీ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 14 మందిని రాష్ట్రస్థాయి సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేశారు.

# తొలి కార్పొరేషన్ ఎన్నికల్లో కొత్తగూడెంలో ఓటర్లు విలక్షణ తీర్పు

- ఏ పార్టీకి రానీ సంపూర్ణ మెజారిటీ - హంగ్ దిశగా కొత్తగూడెం కార్పొరేషన్.
- కాంగ్రెస్ కు-22, సీపీఐకి-22, బీఆర్ఎస్ కు-8, బీజేపీకి-1, సిపిఎంకు-1, ఇండిపెండెంట్‌లు-6.
- ఎమ్మెల్యే కూనంనేని కి బీఆర్ ఎస్ నుంచి మద్దత్తు ఇస్తామని కేటీఆర్ ఫోన్
- సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా సీపీఐకి మేయర్ పదవి ఆఫర్ డిప్యూటీ మేయర్ కాంగ్రెస్‌కు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)






భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి 14 : భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులపై ఉత్కంఠత నెలకొంది. కాంగ్రెస్ సిపిఐ మధ్య పొత్తు కుదరకపోవడంతో ఎవరికి వారు విడివిడిగా పోటీ చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు దక్కించుకోవాలంటే మొత్తం 60 డివిజన్లలో 30 నుంచి 32 లోపు డివిజన్లు గెలవాల్సి ఉంది. కానీ కాంగ్రెస్ కు 22, సిపిఐకి 22 డివిజన్లు దక్కాయి. బీఆర్ఎస్ ఎనిమిది డివిజన్ల లో విజయం సాధించగా, ఆరు డివిజన్ల లో ఇండిపెండెంట్ లు గెలుపొందారు. బిజెపి, సిపిఎం చెరకస్థానాన్ని దక్కించుకున్నాయి. సిపిఎం గెలుపొందిన స్థానంలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. పొత్తులో కాంగ్రెస్ బలం 23 కు చేరుకుంది. ఈ పరిస్థితిలో కొత్తగూడెం తొలి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీల బలాబలాలు చూసుకుంటే హంగ్ ఏర్పడే పరిస్థితి వచ్చింది. ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీల ఓట్లతో పోల్చుకుంటే కాంగ్రెస్ కు కానీ, సిపిఐకి గాని ప్రత్యక్షంగా మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు వచ్చే అవకాశం లేదు. ఈ క్రమంలో ఎనిమిది స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్, సీపీఐ కి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. స్వయంగా బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఫోన్ చేసి తాము మద్దతు ఇస్తామని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో సిపిఐ, బీఆర్ఎస్ మధ్య పొత్తు కుదరకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగి, ఎమ్మెల్యే సాంబశివరావు కు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలుస్తోంది.


కూనంనేనికి సీఎం రేవంత్ రెడ్డి ఫోన్...

కొత్తగూడెం నియోజకవర్గం రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేవంత్ రెడ్డి ఫోన్ ద్వారా సీపీఐ రాష్ట్ర నాయకుడు కూనంనేని సాంబశివ రావు తో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పదవిని సీపీఐకి ఇవ్వడం, డిప్యూటీ మేయర్ పదవిని కాంగ్రెస్ పార్టీకి కేటాయించే అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. స్థానిక స్థాయిలో కాంగ్రెస్–సీపీఐ మధ్య లోపించిన సమన్వయం ను బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియలో పరస్పర మద్దతు ఇవ్వాలనే దిశగా చర్చలు సాగినట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కొత్తగూడెం నియోజకవర్గం రాజకీయాల్లో ఈ పరిణామం ఎటు వైపు పయనిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ తొలి సరిగా జరిగిన కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు సర్వత్ర ఉత్కంఠతను, ఆసక్తిని రేకెత్తిస్తున్నాయని స్పష్టం అవుతుంది.

# 16న ఎపికి వస్తున్న బిల్‌గేట్స్

- మూడుసార్లు ఎపికి రప్పించిన ఘనత నాదే
- సంజీవిని పథకం వస్తున్నారని వెల్లడించిన చంద్రబాబు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




అమరావతి, ఫిబ్రవరి 14 : మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ 16న సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన భేటీలో సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. 'ఎల్లుండి అమరావతికి బిల్ గేట్స్ వస్తున్నారు. బిల్ గేట్స్‌ను 3 సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే' అని సగర్వంగా ప్రకటించారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం గేట్స్‌ను రప్పించానని, ఇప్పుడు సంజీవని పథకం కోసం పిలిపిస్తున్నామని వివరించారు. ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతోంది. బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, సంజీవని పథకం అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2025లో ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం. ఇది రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా మార్చడం, ప్రతి పౌరుడికీ డిజిటల్ హెల్త్ రికార్డులు, ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ హెల్త్ రికార్డులు: సంజీవని పథకం కింద ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొ÷ల్/డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తారు. ఇందులో వైద్య పరీక్షలు, చికిత్స చరిత్ర, ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, వ్యాక్సినేషన్ రికార్డులు స్టోర్ అవుతాయి. మొబైల్ ఫోన్ ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చు. క్యాష్‌లెస్, పేపర్‌లెస్ మాత్రమే కాకుండా తక్షణ సాయం అందుతుంది. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స (యూనివర్సల్ హెల్త్ కవరేజ్). అవసరమైతే ట్రస్ట్ ద్వారా అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం రూ.25 లక్షల వరకు సాయం అందించనున్నారు. ముందుగానే రోగాలను గుర్తించడం. ఉదాహరణకు 30 ఏళ్లు దాటిన వారికి, హై–రిస్క్ కేసులకు స్క్రీనింగ్. రాష్ట్రవ్యాప్తంగా 72.73 లక్షల మందికి 42 రకాల వైద్య పరీక్షలు (రక్త పరీక్షలు, డయాబెటిస్, , గుండె సంబంధిత వంటివి) చేస్తారు. ఏఐఆధారిత స్క్రీనింగ్, పర్సనలైజ్డ్ మెడిసిన్ కార్యక్రమాన్ని బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్, టాటా కన్‌స్టలెన్సీ సర్వీసెస్ సహకారంతో అమలు చేస్తున్నారు. ఇది ఆయుష్మాన్ భారత్, హెల్త్ సర్వీసెస్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. అమరావతి రాజధాని ప్రాంతంగా ఉండటంతో.. సంజీవని పథకం ఇక్కడ ప్రధానంగా అమలు చేయాలని చూస్తున్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు, పర్సనలైజ్డ్ మెడిసిన్ వంటి అంశాలు అమరావతిలో ఫోకస్ చేస్తున్నారు. బిల్ గేట్స్ తన పర్యటనలో (ఫిబ్రవరి 16) అమరావతికి వచ్చి ఈ పథకంపై చర్చలు జరుపుతారు. ఇది అమరావతిని హెల్త్‌కేర్ / టెక్నాలజీ హబ్‌గా మార్చే భాగంగా చూస్తున్నారు. మొదటి పైలట్ ప్రోగ్రాం కుప్పం నియోజకవర్గంలో విజయవంతంగా ప్రారంభమైంది. తర్వాత 2026 జనవరి నుంచి చిత్తూరు జిల్లా మొత్తం అమల్లోకి తెచ్చారు. 2026లో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా అమలు చేస్తారు. జూలై 2026 నాటికి లక్షల మంది స్క్రీనింగ్ పూర్తి చేసి, ఆరోగ్య భద్రతను బలోపేతం చేయాలనేది ఈ పథకం లక్ష్యం. ఈ పథకం రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చే 'గేమ్ ఛేంజర్'గా చెబుతున్నారు.

# మాదిగలంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బొల్లి స్వామి
- మాదిగల మహాశక్తి ఆత్మీయ సదస్సుకు తరలిన నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ధర్మపురి, ఫిబ్రవరి 14 : మాదిగలంతా సామాజికంగా, రాజకీయంగా,ఆర్థికంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో శనివారం కరీంనగర్ లోని ప్రతిమ మల్టీప్లెక్స్ హాల్ లో మాదిగల మహాశక్తి ఆత్మీయ సదస్సు మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నర్సింహులు నేతృత్వంలో ఏర్పాటు చేశామని తెలంగాణ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బొల్లి స్వామి పేర్కొన్నారు. మాదిగల మహాశక్తి ఆత్మీయ సదస్సుకు ధర్మపురి నియోజకవర్గంలో నుండి అధిక సంఖ్యలో మాదిగ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొంటున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా బొల్లి స్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో జనాభా దామాషా ప్రకారంగా మాదిగలకు 19 నియోజకవర్గాలు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే లెదర్ పార్క్ భూములు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే తగిన రీతిలో లీజుకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మాదిగ సంఘం రాష్ట్ర నాయకులు మామిడిపల్లి ప్రసాద్ మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గమంత ఏకతాటిపై నిలిస్తే నిజమైన మహాశక్తి ఏర్పాటు చేయవచ్చని అన్నారు. కులమంతా ఏకమైతే ఎలా ఉంటుందో ముస్లిం సోదరులు నిరూపించుకుంటారని, అలాగే వారిని ఆదర్శంగా తీసుకుని అన్ని సామాజిక వర్గాలు అభివృద్ధి చెందుతున్న మాదిగ సామాజిక వర్గం మాత్రం అభివృద్ధి చెందకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మాదిగ సామాజిక వర్గ సోదరులంతా స్పందించి ఏకతాటిపై రాజకీయాల్లో తమ అభ్యర్థనను గెలిపించుకోవాలని కోరారు. ధర్మపురి నియోజకవర్గం నుండి సుమారుగా 150 మందికి పైగా మాదిగ మహా శక్తి సభకు వెళ్లినట్లు బొల్లి స్వామి, మామిడిపల్లి ప్రసాద్ తెలిపారు

# ఆరోగ్యం



## ఈ గింజలు తింటే జుట్టు రాలడం తగ్గిపోతుంది, ఎంత గుంజినా ఒక్క వెంట్రుక కూడా ఊడదు!

కాలుష్యం, మారుతున్న జీవన విధానం కారణంగా ప్రతి ఒక్కరూ ముఖ్యంగా ఎదుర్కొంటున్న సమస్య జుట్టు రాలడం. ఈ సమస్య కారణంగా చాలా మంది తీవ్రంగా బాధపడుతుంటారు. వాటిని నివారించుకోవడానికి రకరకాల ప్రొడక్ట్స్ వినియోగిస్తుంటారు. అయినా వారు ఫలితాలు పొందలేకపోతారు. అలాంటి వారు అవిసె గింజలను వినియోగించడం వలన అనేక మంచి ఫలితాలను పొందవచ్చు. వీటి వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**అవిసె గింజల వలన ఉపయోగాలు**

అవిసె గింజలు చిన్నవిగా ఉండి, ఆరోగ్యానికి అవసరమైన అనేక పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, లిగ్నన్స్, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ వంటి మూలకాలు పుష్కలంగా ఉన్నాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ రక్తపోటును తగ్గించడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, గుండె జబ్బుల రిస్క్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

జీర్ణక్రియ కోసం అవిసె గింజల్లోని అధిక ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. అలాగే, అవిసె గింజలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి, దీనివల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకీ ఇవి లాభదాయకంగా ఉంటాయి.

క్యాన్సర్ కోసం లిగ్నన్స్ అవిసె గింజల్లో ఉన్న మరో ముఖ్యమైన పోషకం, ఇది క్యాన్సర్ కణాల పెరుగుదలను అరికట్టే లక్షణాలను కలిగి ఉంటుంది. అవిసె గింజలు రొమ్ము, ప్రోస్టేట్ మరియు పెద్దప్రేగు క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అదేవిధంగా, ఫైబర్ కడుపుని నింపుతూ, అధిక ఆహారాన్ని తీసుకోవడం నివారించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. క్యాన్సర్ కోసం లిగ్నన్స్ అవిసె గింజల్లో ఉన్న మరో ముఖ్యమైన పోషకం, ఇది క్యాన్సర్ కణాల పెరుగుదలను అరికట్టే లక్షణాలను కలిగి ఉంటుంది. అవిసె గింజలు రొమ్ము, ప్రోస్టేట్ మరియు పెద్దప్రేగు క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అదేవిధంగా, ఫైబర్ కడుపుని నింపుతూ, అధిక ఆహారాన్ని తీసుకోవడం నివారించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

**జుట్టు ఆరోగ్యం కోసం**

అవిసె గింజల్లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని తేమగా ఉంచి చర్మ సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. అవిసె గింజల్ని రెగ్యులర్‌గా తీసుకోవడం మహిళల్లో హార్మోన్ల సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది.రుతుక్రమ సమస్యలు,మెనోపాజ్ లక్షణాలను తగ్గించడంలో కూడా ఇవి ప్రయోజనకరమైనవి.అవిసెగింజల్లోని ఒమేగా-3ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని ఇంఫ్లమేషన్‌ను తగ్గించడంలో సహాయపడతాయి,అలాగే జుట్టు ఆరోగ్యంగా, బలంగా మారడంలో కూడా ఇవి కృషి చేస్తాయి.

## కర్ణాటక స్పెషల్ తెల్ల పులిహోరా..

**ప్రతి ఇంట్లో ఎదో ఒకరోజు అన్నం మిగిలిపోతూ ఉంటుంది. ఇలా అన్నం మిగిలిపోయినప్పుడు పడేయడం కంటే ఆ అన్నంతో వేరే విధంగా వేరే ఏదైనా వంట చేసుకుంటే చాలా బాగుంటుంది. మన తెలుగు రాష్ట్రాల్లో మిగిలిపోయిన అన్నంతో పులిహోర లేదా ఎగ్ రైస్ చేసుకుంటూ ఉంటారు. అయితే ఈసారి ఈ కర్ణాటక స్పెషల్ తెల్ల పులిహోర ట్రై చేసి చూడండి. ఇది చాలా రుచికరంగా ఉంటుంది. అలాగే క్షణాల్లోనే సిద్ధమైపోతుంది. ఈ తెల్ల పులిహోరను ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.**

రెండు కప్పుల అన్నం గుప్పెడు జీడిపప్పు ఒక ఉల్లిపాయ రెండు ఎండుమిర్చి మూడు పచ్చిమిర్చి రెండు స్పూన్ మెంతి ఆకుల తురుము ఒక స్పూన్ నిమ్మరసం అరకప్పు కొబ్బరి తురుము గుప్పెడు వేరు శెనగ పలుకులు రుచికి సరిపడా ఉప్పు అయిదు మిరియాలు ఒక స్పూన్ మినపప్పు ఒక స్పూన్ పచ్చి శనగ పప్పు ఒక స్పూన్ జీలకర్ర ఒక స్పూన్ ఆవాలు రెండు స్పూన్ల నూనె తెల్ల పులిహోర తయారీ విధానం ముందుగా వండుకున్న అన్నం లేదా, మిగిలిపోయిన అన్నాన్ని పొడి పొడిగా వచ్చే విధంగా చేసుకొని ఆరబెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి అందులో నూనె పోసుకోవాలి. అందులోనే గుప్పెడు జీడిపప్పు, వేరుశనగ పలుకులు వేసుకొని రంగు మారేంత వరకు వేయించుకోని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే నూనెలో ఆవాలు,



జీలకర్ర, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, శెనగపప్పు వేసుకొని వేయించుకోవాలి. మాడిపోకుండా మీడియం మంట మీదనే వీటిని వేయించుకోవాల్సి ఉంటుంది. మంట ఎక్కువైతే కచ్చితంగా మాడిపోతుంది. ఆ తరువాత అందులోనే ఉల్లిపాయ ముక్కలు కూడా వేసుకోవాలి. అలాగే కొంచెం ఉప్పు కూడా వేసుకుంటే ఉల్లిపాయలు త్వరగా మగ్గిపోతాయి. అలాగే అందులోనే తరిగిన మెంతి కూరను వేసుకొని రెండు నిమిషాల పాటు బాగా మెత్తగా అయ్యే విధంగా వేయించుకోవాలి. ఇప్పుడు సన్నగా తరిగిన కొబ్బరిని కూడా అందులో వేసుకొని బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ముందుగా విడదీసుకొని పక్కనపెట్టుకున్న అన్నాన్ని అందులో వేసుకోవాలి. ఒక నిమ్మకాయను కోసి అందులో రసం పిండుకోవాలి. ఇప్పుడు పులిహోర కలిపినట్లు వాటినంతా బాగా కలుపుకోవాలి.

## కాకరకాయ కొత్తిమీర కారం



**కాకరకాయ పేరు ఎత్తగానే చాలామంది ముఖం పక్కకు తిప్పేస్తారు. కాకరకాయ చేదుగా ఉంటదని దీని జోలికి పోరు. అయితే సరైన పద్ధతిలో చేస్తే కాకరకాయని మించిన టేస్ట్ మరి దేనికి రాదు. కాకరకాయ కొత్తిమీరతో చేసే కారం వేడి వేడి అన్నంలో తింటి ఇంక అద్భుతంగా ఉంటుంది. కాకరకాయ కొత్తిమీర కారం చాలా ఈజీగా తయారుచేసుకోవచ్చు. కాకరకాయ కొత్తిమీర కారం చేసుకోడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.**

కాకరకాయ కొత్తిమీర కారం తయారీకి కావాల్సిన పదార్థాలు - 500 గ్రాముల కాకరకాయలు -1/4 కప్పు ఆయిల్ -2 టేబుల్ స్పూన్ల పల్లీలు -అర టీ స్పూన్ ఆవాలు -అర టీస్పూన్ జీలకర్ర -ఉసిరికాయ సైజ్ చింతపండు -కొంచెం బెల్లం -ఇంచు అల్లం -5 పచ్చిమిరపకాయలు -100 గ్రాముల కొత్తిమీర -ఉప్పు -పసుపు -1 ఉల్లిపాయ.

కాకరకాయ కొత్తిమీర కారం తయారీ విధానం -అరకేజీ కాకరకాయలను చెక్కు తీసి లోపల గింజలను కూడా తీసేసి మీకు నచ్చిన షేపులో చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి.

-కట్ చేసిన ముక్కల్లో ఉప్పు,పసుపు వేసి అరగంట సేపు ఊరనివ్వాలి. -తర్వాత ముక్కలను చేతుల్లోకి తీసుకొని పిండి వాటిని ఓ బౌల్ లో వేసుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి కొంచెం ఆయిల్ పోసి అందులో పల్లీలు వేసి వేయించి పక్కన పెట్టుకోండి. అదే నూనెలో ఆవాలు,జీలకర్ర వేసి చిట్లనివ్వాలి. -అందులో పసరు పిండిన కాకరకాయ ముక్కలు, ఉల్లిపాయ చీలికలు వేసి నిదానంగా వేగనివ్వాలి. -ఇప్పుడు మిక్సీ గిన్నెలో కాడలతో సహా కొత్తిమీర,చింతపండు, పచ్చిమిరపకాయలు, అల్లం వేసి గ్రైండ్ చేయాలి. తర్వాత అందులో వేయించిన పల్లీలు, కొంచెం నీళ్లు వేసి ఇంకోసారి గ్రైండ్ చేసుకోవాలి. బరకగా చేసుకోండి. -తర్వాత వేగిన కాకరకాయ ముక్కల్లో మిక్సీలో చేసుకున్న మిశ్రమాన్ని,కొంచెం బెల్లం వేసి బాగా కలపండి. మూతపెట్టి నాలుగు నిమిషాలు వేగనివవ్వాలి. అంతే కాకరకాయ కొత్తిమీర కారం రెడీ.

## ఒక కప్పు ఈ గంజి తాగితే.. ఒక్క నెలలోనే ఊహించని ఫలితాలు పొందుతారు!

**మీరు లావుగా ఉన్నారా? బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నారా? బరువు తగ్గాలంటే ముందుగా ఆహారంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే మనం ఎలాంటి ఆహారం తింటామో అదే మన బరువును నిర్ణయిస్తుంది. ఒకవేళ మీరు మంచి ఆహారాన్ని, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని సరైన సమయంలో తింటే మీ బరువులో కచ్చితంగా మార్పు కనిపిస్తుంది. ఒకవేళ మీరు త్వరగా బరువు తగ్గాలని అనుకుంటే మిల్లెట్స్ ఫుడ్స్ ఎంతగానో మీకు సహాయపడుతుంది. అందులో ఒకటే గుర్రపు ముల్లంగితో చేసే గంజి. ఇది తాగితే బరువు తగ్గడంతో పాటు వ్యాధులన్నీ దూరమైపోతాయి. దీనిని ఎలా చేసుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం.**

గుర్రపు ముల్లంగి గంజి తయారీకి కావాల్సిన పదార్థాలు గుర్రపుముల్లంగి బియ్యం - ముప్పావు కప్పు, పచ్చి శెనగ పప్పు - 1 కప్పు, వెల్లుల్లి - 5, లవంగాలు, మెంతులు - 1/2, ఉప్పు - రుచికి సరిపడా నీరు - అవసరమైనంత, కొబ్బరి తురుము - 1 పిడికెడు గుర్రపు ముల్లంగి గంజి తయారీ విధానం, ముందుగా పచ్చి శనగలను రాత్రి పడుకునే ముందు నీళ్లలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం గుర్రపుముల్లంగి బియ్యాన్ని తీసుకుని 4 సార్లు శుభ్రంగా కడుక్కొని ఓ కుక్కర్‌లో తీసుకోవాలి. కడిగిన గుర్రపుముల్లంగి బియ్యంలో నానబెట్టిన పచ్చి పప్పు వేయాలి. తర్వాత వెల్లుల్లి రెబ్బలు,



మెంతి గింజలు వేయాలి. తర్వాత అందులో బియ్యం, పప్పు మునిగినంత మేరకు 5 కప్పుల నీళ్లు పోయాలి. తర్వాత రుచికి సరిపడా ఉప్పు వేసి స్టవ్ మీద కుక్కర్ పెట్టాలి. తర్వాత కుక్కర్‌ను మూతపెట్టి 7-విజిల్స్ వచ్చే వరకు అలానే ఉంచాలి. తద్వారా బియ్యం మరియు పప్పు పూర్తిగా కలపాలి. 7 విజిల్స్ పూర్తగానే కుక్కర్ మూత తీసి.. గంజిని బాగా కలపాలి గంజి చాలా చిక్కగా ఉంటే, అవసరమైనంత నీరు పోసి మళ్ళీ కలపాలి. చివరగా తురిమిన కొబ్బరిని చిలకరిస్తే రుచికరమైన గుర్రపుముల్లంగి గంజి రెడీ.

## సాంబార్ ఉప్మా




హాస్టల్‌లలో తినో, లేదా ఇంట్లో అమ్మ ఎక్కువగా ఉప్మా చేయడం వల్లనో తెలియదు కానీ ఉప్మా అంటే చాలా మందికి ఇష్టం ఉండదు. దానిని తినాలంటేనే కొందరు తమ మొహం తిప్పేసుకుంటారు. అంతలా బోర్ కొట్టేస్తుంటుంది కొందరికి. అలా ఉప్మా అంటే చిరాకు పడే వారికి ఈసారి కొత్తగా ఇలా సాంబార్ ఉప్మా చేసి పెట్టండి. దీనిని ఉదయం టిఫిన్ మాదిరిగా అయినా లేదా మధ్యాహ్నం లంచ్ మాదిరిగా అయినా చేసుకొని తినేయొచ్చు. అయితే ఈ సాంబార్ ఉప్మా ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. సాంబార్ ఉప్మా తయారు చేసుకోవడానికి కావాల్సిన పదార్థాలు ఉప్మా రవ్వ సాంబార్ ఉల్లిపాయలు కారం కొత్తిమీర నెయ్యి ఉప్పు నీళ్లు సాంబార్ ఉపమా తయారు చేసుకునే విధానం ఈ సాంబార్ ఉప్మాను తయారు చేసుకోవడం చాలా సులభం. ముందుగా ఒక పాత్ర తీసుకొని స్టవ్‌పైన పెట్టుకోవాలి. ఇప్పుడు అందులో కొంచెం నెయ్యి వేసుకొని వేడి చేయాలి. దీనిలో రవ్వ వేసుకొని లేత బంగారు వర్ణంలో వచ్చేంత వరకు బాగా వేయించుకోవాలి. ఇప్పుడు లేత బంగారు వర్ణంలో వేయించుకున్న ఉప్మాలో సాంబార్ వేసుకొని కలుపుకోవాలి. అందులోనే చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకున్న ఉల్లిపాయ ముక్కలను వేసుకోవాలి. అలాగే కొంచెం కారం వేసుకొని బాగా కలుపుకోవాలి. అలాగే కావాల్సినంత నీరు పోసుకొని, ఉప్పు పోసుకొని మూత పెట్టుకొని బాగా ఉడకపెట్టుకోవాలి. ఉడికిన తరువాత కొంచెం కొత్తిమీర వేసుకొని కాసేపు ఉడికించి కిందకు దించుకుంటే సాంబార్ ఉప్మా సిద్ధమైనట్లే.

# సినిమా న్యూస్



# గ్లామర్ తో మతులు పోగొడుతున్న సుందరవల్లి!



సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎంతోమంది సెలబ్రిటీలు పాపులారిటీని సంపాదించుకోవడమే కాకుండా.. తమ సినిమాలను కూడా ప్రమోట్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ తమ పాత్రలను రివీల్ చేస్తూ తమ సినిమాలకు వస్తున్న రెస్పాన్స్ కి.. ఆడియన్స్ కి కృతజ్ఞతలు కూడా తెలియ జేస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక హీరోయిన్ తన పాత్ర పేరుతో అభిమానులకు కృతజ్ఞతలు చెప్పుకొచ్చింది. తన సినిమా టీజర్ కి ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు మంత్రముగ్ధులైన ఆమె.. ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా స్పెషల్ ఫోటోలతో పాటు స్పెషల్ గా ధన్యవాదాలు కూడా తెలియజేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ యంగ్ బ్యూటీ నభా నటేష్. తాజాగా ఈమె నిఖిల్ సిద్ధార్థ 'స్వయంభు' సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాలో సుందరవల్లి పాత్రలో నటిస్తున్నట్లు ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. భరత్ కృష్ణమాచార్య దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నభా నటేష్ తో పాటు సంయుక్త మీనన్ కూడా నటిస్తోంది. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఈ సినిమా టీజర్ ని మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్ కి విశేష స్పందన లభిస్తున్న నేపథ్యంలో పైగా ఈరోజు వాలెంటైన్స్ డే సందర్భంగా కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ మీ సుందరవల్లి వాలెంటైన్స్ డే సందర్భంగా మీకు స్పెషల్ విషెస్ తెలియజేస్తోంది. స్వయంభు టీజర్ కి అందించిన ఆదరణకు ధన్యవాదాలు అంటూ తెలియజేసింది. ఇకపోతే తాజాగా సుందరవల్లి గెటప్ లో తన అందంతో మరోసారి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గ్రీన్ అండ్ రెడ్ కలర్ లెహంగా ధరించి టాప్ స్లీవ్ లెస్ అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. గ్లామర్ విందు వడ్డిస్తూ యువతకు ఊపిరాడకుండా చేసింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికైతే వాలెంటైన్స్ డే సందర్భంగా నభా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే ఈ సినిమా ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా వీఎఫ్ఎక్స్ కారణంగా ఈ సినిమాను వాయిదా వేశారు. ఇదే విషయంపై చిత్ర బృందం స్పందిస్తూ.. ఈ రోజుల్లో ఒక్క సీన్ పర్ఫెక్ట్ గా లేకపోయినా ప్రేక్షకులు క్షమించడం లేదు. విఎఫ్ఎక్స్ లో జరిగే ఒక్క తప్పు స్నోబాల్ ఎఫెక్ట్ లా సినిమాని చుట్టేస్తోంది. ఇటీవల పోస్ట్ ప్రొడక్షన్ అనేది అటు నిర్మాత.. ఇటు నిర్మాణ సంస్థ చేతుల్లో ఉండడం లేదు .. అందరూ కూడా హిట్ సినిమానే కోరుకుంటున్నారు కాబట్టి ప్రతి ఒక్కరూ కష్టపడి సీజీ షాట్స్ సరిగ్గా చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా సినిమాను ఎన్ని ఏళ్ళు తీశామన్నది ప్రేక్షకులు చూడరు ఎంత బాగా తీశామన్నదే చూస్తారు.. అందుకే సినిమాను ఆలస్యంగా విడుదల చేస్తాం అంటూ చెప్పుకొచ్చారు. ఏది ఏమైనా సినిమాపై అంచనాలను పెంచుతూ వి ఎఫ్ ఎక్స్ పై భారీగా కష్టపడుతున్నట్లు చెప్పుకొచ్చింది చిత్ర బృందం. మరి నబా నటేష్ సుందరవల్లి పాత్రలో ఏ విధంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.

# వాలెంటైన్స్ డే స్పెషల్: అప్పుడే పెళ్లి అంటూ మృణాల్ క్లారిటీ!



మృణాల్ ఠాకూర్.. బాలీవుడ్ సీరియల్స్ లో నటిస్తూ కెరియర్ మొదలుపెట్టిన ఈమె.. మరాఠీ చిత్రం ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమైంది. ఇందులో తన నటనతో ఆకట్టుకున్న ఈమె.. ఆ తర్వాత హిందీలో వరుసగా అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. ఇక ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నేరుగా చేసిన తెలుగు చిత్రం 'సీతారామం'. ఈ సినిమా కోసం ఈమెను ఎంపిక చేసుకొని మరీ తెలుగు తెరకు పరిచయం చేశారు. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమా నుండీ శృతిహాసన్ తప్పుకోవడంతో ఆస్థానాన్ని భర్తీ చేసింది. ఈ సినిమా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. మరోవైపు హిందీలో సిద్ధాంత్ చతుర్వేదితో ఒక సినిమా చేస్తోంది. ఇకపోతే చేస్తున్నది సినిమాలు తక్కువే అయినా.. ఎఫైర్ రూమర్స్ తో మాత్రం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. అందులో భాగంగానే గత రెండు నెలలుగా ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ తో ప్రేమలో ఉంది అంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయాలపై ఆమె ఖండించిన విషయం తెలిసిందే. అయితే కొంతమంది ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా ఫిబ్రవరి 14వ తేదీన వీరిద్దరూ వివాహం చేసుకోబోతున్నారు అంటూ రూమర్స్ క్రియేట్ చేశారు. దీంతో ఈ రూమర్స్ పై గత రెండు రోజుల క్రితం స్పందించిన ఈమె.. మళ్లీ తన పెళ్లిపై ఊహించని కామెంట్లు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది.. అసలు విషయంలోకి వెళితే.. ధనుష్ తో మృణాల్ ఫిబ్రవరి 14వ తేదీన ఏడడుగులు వేయబోతోంది అంటూ వార్తలపై ఆమె మాట్లాడుతూ.. "ఫిబ్రవరి 14 కాస్త నాకు ఏప్రిల్ ఒకటిగా మారినట్టు అనిపిస్తోంది. ఎందుకంటే ఏప్రిల్ ఒకటి ఫుల్ డే కదా.. ఇదంతా ఎవరు మొదలు పెడుతున్నారో కూడా నాకు అర్థం కావడం లేదు. పైగా నేను ఈ డేట్ ను అధికారికంగా చెప్పినట్లు కొంతమంది ఇలాంటి గాసిప్స్ కూడా వ్యాపింప చేస్తున్నారు. దీనిపై నాకు మరింత భయంగా ఉంది అంటూ ఆమె కామెంట్లు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తాజాగా పెళ్లి పై స్పందించింది మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఆంగ్లం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి మాట్లాడుతూ.." వివాహం విషయంలో తొందర లేదు. పెళ్లి చేసుకుంటాను. కానీ దానికంటూ సమయం రావాలి. సరైన వ్యక్తి నా జీవితంలోకి వచ్చినప్పుడే నేను వివాహ బంధంలోకి అడుగు పెడతాను.. అప్పుడు నేనే స్వయంగా నా సోషల్ మీడియా అకౌంట్లో ఈ విషయాన్ని పోస్ట్ చేస్తాను. ఆ విషయాన్ని మీతో పంచుకునే మొదటి వ్యక్తిని కూడా నేనే అవుతాను. అప్పటివరకు ఇలాంటి రూమర్స్ ని నమ్మకండి" అంటూ ఆమె క్లారిటీ ఇచ్చింది. ఏది ఏమైనా తన పెళ్లి గురించి తానే స్వయంగా ప్రకటిస్తానని చెప్పడంతో ఇకపై ఆమెపై ఎన్ని రూమర్స్ వచ్చినా.. అవన్నీ ఫేక్ అండ్ నేటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇదివరకే మృణాల్ తన మాజీ బాయ్ ఫ్రెండ్ గురించి చెబుతూ తాను సినిమాలలో చేయడం తన బాయ్ ఫ్రెండ్ కి ఇష్టం లేదని అందుకే బ్రేకప్ చెప్పుకున్నాను అని కూడా చెప్పుకొచ్చింది.

# మెగాస్టార్ మూవీ..అనస్వరకు లక్కీ ఛాన్స్!



వరుస ఫ్లాపులతో సతమతమైన మెగాస్టార్ చిరంజీవి ఈ సంక్రాంతికి బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేసిన విషయం తెలిసిందే. ఆయన కథానాయకుడిగా హిట్ మెషీన్ అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఫ్యామిలీ యాక్షన్ డ్రామా -మన శంకరవరప్రసాద్ గారు-. లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ జనవరి 12న సంక్రాంతి బరిలో నిలిచిన ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ని సొంతం చేసుకుని ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మెగా ఫ్యాన్స్‌ని సమ్మోహన పరిచింది. సంక్రాంతి బరిలో ఎన్ని సినిమాలు పోటీపడినా వాటన్నింటినీ వెనక్కి నెట్టి సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది. చిరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలని ఔరా అనిపించింది. ఫస్ట్ షో నుంచే మంచి టాక్‌ని సొంతం చేసుకున్న ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్‌గా రూ.300 కోట్లు రాబట్టి ఈ స్థాయిలో ఈ ఏడాది ప్రారంభంలో అత్యధిక వసూళ్లని రాబట్టిన తొలి రీజనల్ మూవీగా నిలిచింది. అంతే కాకుండా మెగాస్టార్‌లో సరికొత్త ఉత్సాహాన్ని అందించింది. ఇదిలా ఉంటే ఈ మూవీ తరువాత మెగాస్టార్ నటించిన -విశ్వంభర- రిలీజ్‌కు రెడీ అవుతోంది. త్వరలోనే దీని రిలీజ్ డేట్‌ని మేకర్స్ అధికారికంగా ప్రకటించబోతున్నారు. ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో చిరు మరో క్రేజీ మాస్ మసాలా యాక్షన్ సినిమాకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. డైరెక్టర్ బాబి కొల్లి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి ఓ భారీ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు. దీన్ని దళపతి విజయ్‌తో -జన నాయగన్-, యష్‌తో -టాక్సిక్- మూవీలని నిర్మిస్తున్న కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట్ కె. నారాయన నిర్మించబోతున్నారు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ చాలా రోజులుగా జరుగుతోంది. -జన నాయగన్- చుట్టూ సెన్సార్ ఇబ్బందులు తలెత్తడంతో ఈ ప్రాజెక్ట్ ఆలస్యం అవుతూ వస్తోంది. ఇటీవల సెన్సార్ వివాదం ఫైనల్‌కు చేరడంతో నిర్మాత చిరు సినిమాపై దృష్టి పెట్టినట్టుగా తెలిసింది. ఈ మూవీని తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో పవర్ ఫుల్ స్టోరీగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఇందు కోసం చిరుకు కూతురుగా ఎవరైతే బాగుంటుందని ఇప్పటికే కొంత మంది యంగ్ క్రేజీ హీరోయిన్‌ల పేర్లను పరిశీలించిన టీమ్ ఫైనల్‌గా -రేఖా చిత్రం-, ఛాంపియన్, విత్ లవ్ చిత్రాల ఫేమ్ అనస్వర రాజన్‌ని ఫైనల్ చేసినట్లుగా ఇన్ సైడ్ టాక్. కథలో కూతురు పాత్రకు అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఆ క్యారెక్టర్‌లో బాగా పాపులర్ అయిన నటి అయితే బాగుంటుందని భావించిన మేకర్స్, డైరెక్టర్ బాబి చాలా జాగ్రత్తలు తీసుకుని భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ కావడంతో అనస్వర నటన సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తుంది భావించి ఫైనల్‌గా ఆ పాత్ర కోసం అనస్వర రాజన్‌ని ఫైనల్ చేసినట్టుగా సినీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

# అమాయకపు చూపులతో యువతను మాయ చేస్తున్న అనన్య!



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో గ్లామర్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది తెలుగమ్మాయి అనన్య నాగళ్ల. సోషల్ మీడియా వేదికగా ఈమె చేసే గ్లామర్ రచ్చ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పొట్టి బట్టల్లో స్కిన్ షో చేయడం అమ్మడికి అలవాటుగా మారిపోయిందనే కామెంట్స్ కూడా వినిపిస్తూ ఉంటాయి. అలా ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ బ్యూటీ షార్ట్ స్కర్ట్ లో గ్లామర్ ట్రీట్ ఇచ్చింది. తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది . కొంటె చూపులతో కసిగా కవ్విస్తూ యువత గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. తాజాగా యాష్ కలర్ మినీ స్కర్ట్ ధరించిన ఈమె అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నాయి. వాలెంటైన్స్ డే వేళా యువతకు స్పెషల్ ట్రీట్ ఇచ్చింది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అనన్య నాగళ్ళ షేర్ చేసిన ఈ మినీ స్కర్ట్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది ఆమె అభిమానులు. ఈ ఫోటోలకు తెగ లైక్ షేర్ చేస్తూ కామెంట్ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జన్మించిన ఈ తెలుగమ్మాయి.. ఒక వ్యాపారవేత్త కుటుంబం నుంచి వచ్చింది. చదువు కోసం హైదరాబాద్ వెళ్ళిన ఈ ఇబ్రహీంపట్నంలోనే రాజా మహేంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బీటెక్ పూర్తి చేసి ఇండస్ట్రీలోకి రాకముందే ఇన్ఫోసిస్ లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా ఉద్యోగం కూడా చేసింది. 2019లో ప్రియదర్శితో కలిసి మల్లేశం సినిమాకి హీరోయిన్ గా ఎంపికైంది. మొదటి సినిమాతోనే అందరూ దృష్టిని ఆకట్టుకుంది. చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా రాజు రాచకొండ రచించి , దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనన్య నాగళ్ల పాత్రకు మంచి పేరు లభించింది. నిజానికి ఈమె పేరు అనూష నాగళ్ల అయితే ఈ చిత్రం ద్వారానే ఈమెకు అనన్య నాగళ్ళ అని పేరు మార్చారు. ఇక ఇందులో మల్లేశం భార్య పద్మా పాత్రలో ఒదిగిపోయింది.

# తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

## - హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ నజర్
## - కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు
## - మంత్రులు, పార్టీ నేతలతో సీఎం రేవంత్ సమీక్ష
## - ఆయారామ్ గయారామ్ ల హడావిడి
## - సీఎం రేవంత్‌తో భేటీ అయిన వడ్డేపట్టి కౌన్సిలర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 14: మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరవాత సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మరోవైపు ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎంన్నికపై అనుసరించాల్సిన వ్యూహంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించారని సమాచారం. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. ఇకపోతే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది. ఇప్పటికే బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34



స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరట్లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు చెప్పారు. తెలంగాణ జాగృతి పార్వర్డ్ బ్లాక్ ద్వారా పోటీ చేసింది. అయితే అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# రైతుల సంఘాల పేరుతో రాహుల్ భేటీ కృత్రిమం

## రంగస్థలం నిరర్వహించారంటూ కేంద్రమంత్రి విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 : లోక్‌సభ ఆవరణలో రైతు సంఘాల నేతలతో శుక్రవారం కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశమైన సంగతి తెలిసిందే. పార్లమెంట్ భవన సముదాయంలో జరిగిన ఈ భేటీలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, రైతులు, రైతు కూలీల జీవనోపాధిని కాపాడడంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో రైతులతో రాహుల్ భేటీ.. నకిలీ సమావేశం అంటూ బీజేపీ నేతలు విమర్శించారు. రాహుల్ నిర్వహించిన మీటింగ్ కృత్రిమమైనది, అలానే ఆధారం లేనిదంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వీడియోను రిలీజ్ చేశారు. 'రాహుల్ గాంధీ మరోసారి రంగస్థలం నిర్వహించాడు. ఆయన నిర్వహించిన సమావేశం అత్యంత కృత్రిమమైనదిగా ఉంది. అలాగే దీని ద్వారా నకిలీ కథనాన్ని బయటపెట్టారు. ఈ సమావేశంలో కొందరు కాంగ్రెస్ నేతలు రైతులుగా నటించారు. వారితో రాహుల్ గాంధీ నకిలీ సంభాషణ నిర్వహించారు. రైతుల ప్రయోజనాలను ప్రధాని మోదీ పూర్తిగా రక్షించినా కూడా.. అమాయకపు రైతులను తప్పు దోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ, ఆయన స్నేహితులు ఇలాంటి నకిలీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరి నిజ స్వరూపాన్ని బయటపెడతాను' అని గోయల్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అబద్దాలని, నిజమైన రైతులను ఆందోళనకు గురి చేస్తుందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శుక్రవారం రాహుల్‌తో జరిగిన సమావేశంలో అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని రైతు సంఘాల నేతలు వ్యతిరేకించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, పప్పు ధాన్యాల రైతుల బతుకుదెరువు.. ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ ఒప్పందంతో దేశంలోకి వ్యవసాయ దిగుమతులకు తలుపులు తెరుచుకుంటాయని.. ఇతర పంటలు కూడా భారత్‌లోకి ప్రవేశిస్తాయని రాహుల్ వారికి చెప్పారని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# పార్టీ మారిన పలువురికి తప్పని ఓటమి

## ఓటుతో ప్రజలు దూరం పెట్టిన వైనం

హైదరాబాద్,ఫిబ్రవరి14 : పదవుల కోసం ఇష్టారీతిన పార్టీలు మారిన నేతలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు గట్టిగా బుద్ధిచెప్పారు. పలు జిల్లాల్లో పార్టీ మారిన వారిని ప్రజలు తిరస్కరించారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించి, అవసరాలు తీరగానే అవతలి పార్టీలకు వెళ్లిన పలువురికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు షాకిచ్చారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన వేంరెడ్డి రాజు గతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలిచారు. దాంతో అతడికి బీఆర్ఎస్ పార్టీ ఛైర్మన్ పదవి కట్టబెట్టింది. పార్టీలో మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించిన అతను ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన తన భార్య వేంరెడ్డి సంధ్యను కౌన్సిలర్‌గా బరిలో దించారు. 16వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన ఆమెను ఏకంగా 374 ఓట్ల తేడాతో ఓడించి రాజుకు దిమ్మతిరిగేలా చేశారు. మెదక్ జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచిన గాడిపల్లి భాస్కర్‌ను ఛైర్మన్ పదవి కూడా వరించింది. 2014 నుంచి 2020 వరకు ఏకంగా ఆరేళ్లు మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించాడు. అవసరం తీరిన తర్వాత బీఆర్ఎస్‌ను వదిలేసి బీజేపీలో చేరాడు. ఈ ఎన్నికల్లో ఆయన భార్య గాడిపల్లి కళ్యాణిని బీజేపీ అభ్యర్థిగా బరిలో దించాడు. కానీ ఓటర్లు కళ్లుబైర్లు కమ్మేలా షాకిచ్చారు. ఏకంగా 529 ఓట్ల తేడాతో ఓడించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గోలి మమత ఆమెపై ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రచారం చేసినా బీజేపీ అభ్యర్థికి ప్రయోజనం దక్కలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఛైర్మన్ పదవి అనుభవించి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయిన వ్యక్తికి ఓటర్లు బుద్ధిచెప్పారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మున్సిపాలిటీలో మల్లెల రాజశ్రీ బీఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ తర్వాత ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. బీఆర్ఎస్‌లో పదవి అనుభవించిన మల్లెల రాజశ్రీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. ఈ ఎన్నికల్లో కూడా భీంగల్ మున్సిపాలిటీలోని 9వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఓటర్లు ఆమెకు షాకిచ్చారు. ఆమెపై బీఆర్ఎస్ అభ్యర్థి రవి నీలం 75 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

# కరీంనగర్ మేయర్ పీఠం బిజెపిదే

## - కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం
## - ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు - కేంద్రమంత్రి బండి సంజయ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి14 : అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజెక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు.

# ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యం

## కుటుంబ సభ్యుల తీవ్ర ఆందోళన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి14 : హైదరాబాద్ బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన పల్లె అనంతమ్మ (56) గత వారం రోజుల క్రితం ఈ హాస్పిటల్ నుంచి కనిపించకుండా పోయింది. ఇప్పటి వరకు ఆమె ఆచూకీ లభించలేదు. జనవరి 29న కిష్టాపూర్ గ్రామంలో హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత చికిత్స పేరుతో జనవరి 30న కంటి ఆపరేషన్ కోసం గ్రామస్తులను బస్సులో బాచుపల్లి హాస్పిటల్‌కు తరలించారు. కిష్టాపూర్ నుంచి 10 నుండి 15 మంది వెళ్లగా.. అంతా తిరిగి వచ్చారు. కానీ అనంతమ్మ మాత్రం తిరిగి రాలేదు. హాస్పిటల్ సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనలో ఈ నెల 5వ తేదీన అనంతమ్మ హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిసింది. హాస్పిటల్ నిర్లక్ష్యం వల్లే.. ఆమె బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారం రోజులు గడిచినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మా అమ్మ మాకు కావాలి' అంటూ హాస్పిటల్ ముందు కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. 'మా అమ్మను ఎలా తీసుకొచ్చారో అలాగే అప్పగించాలి' అని అనంతమ్మ కొడుకు డిమాండ్ చేస్తున్నాడు. మహిళ ఆచూకీ లభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేట్టారు.

# సిపిఐ నేత గిరిప్రసాద్ సతీమణి కమలాదేవి మృతి

## - సంతాపం ప్రకటించిన ఎమ్మెల్యే కూనంనేని

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): సీపీఐ అగ్ర నాయకులు, కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87) ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లో కన్నుమూశారు. కమలాదేవి భౌతిక కాయాన్ని బంధువులు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆమె పెద్ద కుమార్తె నివాసంలో ఉంచనున్నారు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉంచి తరవాత సాయంత్రం 5-00 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నల్లమల కమలాదేవి మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. నల్లమల కమలాదేవి తన భర్త గిరిప్రసాద్‌కు అనునిత్యం వెంట నడిచి ఆయన పోరాటంలో భాగస్వాములయ్యారని అన్నారు. వారి కుటుంబసభ్యులతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని అన్నారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

## - నైతిక విజయం తమదే అన్న వేముల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్,ఫిబ్రవరి14 :మామున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినయోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీ సాంకేతికంగా విజయం సాధించిందే తప్ప నైతికంగా గెలిచింది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రె స్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తూ, మద్యం, డబ్బులు, చీర లు పంపి ణీ చేసిందని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని బీఆర్ఎస్ అభ్యర్థులు వీరోచితంగా పోటీలో నిలిచారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచినా తాము ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులకు బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపకాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని ఆరోపించారు. అయినప్పటికీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయిందని తెలిపారు.

# అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య

## కిరాతకంగా హత్య చేసిన బావమరుదులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి14 : నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్ నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు.. మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహమ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు.. తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

మొదటిపేజీ తరువాయి

చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# చక్రం తిప్పిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ప్రజాపాలనకు జనం జైకొట్టారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మున్సిపాలిటీని సవాల్‌గా తీసుకున్నా సక్సెస్ కాలేకపోయారు. బీఆర్ఎస్ నాలుగు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరేయడానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డినా 8 చోట్ల మాత్రమే గెలుపు సాధించగలిగారు. 19 స్థానాలు దక్కించుకొని కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ సొంతం చేసుకుంది. రెబెల్స్ పోటీలో లేకుంటే మరో మూడు వార్డులు కాంగ్రెస్ కు దక్కేవి. బీఆర్ఎస్ 5 స్థానాలు, మజ్లిస్ ఒక చోట గెలువగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసిన ముగ్గురు రెబెల్స్ విజయం సాధించారు. 38 వార్డులున్న బోధన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 17 వార్డులు కైవసం చేసుకుంది. రెబెల్స్‌తో కొన్ని వార్డుల్లో పార్టీకి నష్టం వాటిల్లింది. మజ్లిస్ గత వైభవాన్ని చాటుతూ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 3 వార్డులకే పరిమితమైంది. బీఆర్?ఎస్? ఐదు వార్డులు గెలువగా కాంగ్రెస్ రెబెల్ ఒకచోట విజయం సాధించారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్‌కుండ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. బాన్సువాడలో 19 వార్డులకుగాను 11 , ఎల్లారెడ్డి వార్డులకు 10, బిచ్‌కుందలో 12 వార్డులకు 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామారెడ్డి మున్సిసాలిటీల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకునేందుకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఆయా పార్టీలకు ఇండిపెండెంట్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం కానున్నారు.

# రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ. 4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- ట్రిమ్బక్ - పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ. 3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు

మొదటిపేజీ తరువాయి

రెట్లు పెంచారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్‌లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు. తాను టీడీపీలో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్ధిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

# కరీంనగర్‌లో బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయం

మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. ఇండిపెండెంట్ కార్పొరేటర్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు శుక్రవారం రాత్రి సదరు కార్పొరేటర్‌తో సమావేశమయ్యారు. అదే సమయంలో బీఆర్ఎస్ నేతలు కూడా కార్పొరేటర్‌తో రహస్యంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఇండిపెండెంట్లు, ఇతర కార్పొరేటర్లు, బీజేపీ సభ్యుల మద్దతు కోసం ఆఫర్లు ఇవ్వాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు మేయర్‌గా మద్దతిస్తే ఆర్థిక సహాయం కూడా అందిస్తానని కూడా ఆ ఇండిపెండెంట్ కార్పొరేటర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలను కమలం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. తమ పార్టీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యగా బీజేపీ అభివర్ణిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఇది ప్రజలను మోసం చేయడమేనని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విపక్షాల డ్రామాలను ఆధారాలతో సహా ఎండగట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం. కరీంనగర్ మేయర్ పీఠం చుట్టూ జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక నగరానికి పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా ఉన్నాయి. బండి సంజయ్ మీడియా సమావేశం తర్వాత ఈ వ్యవహారం మలుపులు తిరిగే అవకాశం ఉంది.







## మహాశివరాత్రి సందర్భంగా వేలాల జాతరలో 108 సేవలు

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత్**

**- వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 14 మంది ఎంపిక**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల ఫిబ్రవరి 14 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 15, 16వ తేదీల్లో మంచిర్యాల జిల్లాలోని వేలాల జాతర వద్ద ప్రభుత్వం 108 అంబులెన్స్ సేవలు, ప్రత్యేక వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేలల జాతరకు తరలివచ్చే భక్తులు 108 అంబు లెన్స్ సేవలు 24 గంటల పాటు నిరంతరంగా అందుబాటులో ఉంటాయ తెలిపారు. పుణ్యక్షేత్రం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, అక్కడ వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. భక్తులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే చికిత్స అందించి, అవసరమైతే సమీపంలోని పెద్ద ఆసుపత్రులకు తరలించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోరారు.

























Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com